ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని పక్కన పెట్టేసింది.. రివర్స్ టెండరింగ్ పేరుతో అంతా రివర్స్ చేసేసింది.. ఒక్కప్రాజెక్టు పూర్తి చేయలేదు..అన్నదాతల కన్నీటిని తుడవలేదు.. రైతు భరోసా ఇస్తున్నామని చెప్పుకోవడం తప్ప.. అన్నదాత గురించి ఆలోచనే చేయలేదు.. చేస్తే ఇలా ఎందుకు ఉంటుంది.. కేవలం చంద్రబాబుపై కక్ష సాధింపు తప్ప ఏం లేదు.. చంద్రబాబు సీఎం హోదాలో ఆరంభించిన ఏ ఒక్కప్రాజెక్టును పూర్తిచేయలేదు.. రంపచోడవరంలో రూ.223 కోట్లతో ఆరంభించిన ముసురుమిల్లి ప్రాజెక్టు పనులు 95 శాతం పూర్తయ్యాయి. కేవలం ఐదు శాతం పూర్తి చేయాలి.. అది కూడా కేవలం గేట్లు అమరిక.. అదీ చేయలేదు. 29 గ్రామాలకు నీరందించే ప్రాజెక్టును అటకెక్కించారు. గోకవరం మండలం నుంచి 38 కిలోమీటర్ల పరిధిలో 20 గ్రామాలకు సాగునీరందించే సూరంపాలెం కాలువకు కనీసం పూడిక తీయించలేకపోయారు.. 7 గ్రామాలకు సాగునీరందించే మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని ఆపేశారు. పాలకులు అడిగితేనే పుష్కరకాలువ నుంచి నీటిని విడుదల చేసేలా మార్చేశారు. ఇక పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం చంద్ర బాబు హయాంలో ప్రారంభించారు. ఎన్‌జీటీ అనుమతులకు కేవలం రూ.2 కోట్లు కట్టకుండా ఐదేళ్లుగా నిరుపయోగంగా మార్చేశారు. ఇలా ఐదేళ్ల వైసీపీ పాలనకు ఈ ప్రాజెక్టులే నిదర్శనం. సంక్షేమం ముసుగు వేసి పాలన సాగించారు తప్ప.. ప్రజా సంక్షేమం చూడలేకపోయారు. - గోకవరం

ప్రాజెక్టులపై.. జ..గన్!

జగన్ పాలనకు ఈ ప్రాజెక్టు పెద్ద ఉదాహరణ : ఇదీ రంపచోడవరంలోని ముసురుమిల్లి ప్రాజెక్టు..223 కోట్ల ఖర్చుతో 95 శాతం పనులు పూర్తయ్యాయి.. రైతులు గత ప్రభుత్వంలో అందుబాటులోకి వస్తుందని ఆశించారు.. ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం ఐదు శాతం పనులు పూర్తిచేయకుండా ఇలా గాలికొదిలేశారు..







ఏజెన్సీ ప్రాంతం రంపచోడవరంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన ముసురుమిల్లి ప్రాజెక్టుకు ఏళ్ల గడుస్తున్నా ఇప్పటి వరకు గేట్లు అమర్చలేదు. దీంతో నీరు నిల్వ ఉండే మార్గంలేక రైతులు ప్రాజెక్టు ఫలాలను అందుకోలేకపోతున్నారు. ఈ పాటికి గేట్లు అమర్చి ఉంటే సుమారు 23 వేల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి వచ్చేది. గేట్లు కూడా ప్రాజెక్టు వద్దే ఉన్నాయి. అయినా గేట్లు అమర్చలేదు. ప్రాజెక్టు అం దుబాటులోకి రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 2004 సంవత్సరంలో 223 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 5 శాతం పనులు పూర్తిచేయ లేదు. దీంతో 223 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు నిరుప యో గంగా మారిపోయింది.ఈ సాగునీటి పథకానికి కేవలం రూ.5 కోట్లు ఖర్చు చేస్తే ఏజెన్సీ ప్రాంతాలైన రంప చోడ వరం, దేవీపట్నం, గంగవరం మండలాలతో పాటు గోకవ రం, కోరుకొండ మండలాల్లోని 29 గ్రామాలకు చెం దిన 22,300 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

- ఐదేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులన్నీ గాలికే
- పురుషోత్తపట్నానికి ఎన్‌జీటీ అనుమతులు తీసుకురాలేదు
- 5శాతం పనులు పూర్తిచేయలేని ముసురుమిల్లి
- రివర్స్‌టెండర్‌తో ఆగిన మల్లవరం
- సూరంపాలెం కాలువను పూడ్చేశారు
- పుష్కరకాలువ నిర్వహణ అస్తవ్యస్తం
- చంద్రబాబుపై కక్ష.. ముందుకు సాగని ప్రాజెక్టులు
- కూటమి ప్రభుత్వం రాకతో రైతుల ఎదురుచూపులు

పుష్కర కాలువ..కన్నీళ్లు

పుష్కర కాలువ నిర్వహణ సక్రమంగా లేదు. ఆయకట్టు 1.41 లక్షలు.. రూ.600 కోట్లతో 2006లో కాలువ పనులు ప్రారంభిం చారు. ప్రాజెక్టు పరిధిలో 2009 నుంచి పూర్తిగా సాగునీరందించారు. దేవీపట్నం మండలం నేలకోట నుంచి అన్నవరం వరకూ 97 కిలోమీటర్ల మేర సాగు నీరందించే విధంగా ఏర్పాటు చేశారు. మొత్తం 18 మండలాల పరిధిలో ఉంది. ఈ కాలువ కింద గోకవరం మండలంలో 3100 ఎకరాలు, జగ్గంపేట మండలంలో 19 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మొన్నటి వరకూ ఈ కాలువ నిర్వహణ అంతా వైసీపీ నాయకుల చేతుల్లోనే ఉంది. ఐదేళ్లు రైతుల అవసరాలకు తగినట్టు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవు. పుష్కరకాలువ గట్లపై భారీలోడు గ్రావెల్ లారీలు, నల్లకంకర లారీలు రాత్రనక పగలనక తిరగడంతో కాలువ గట్లు దెబ్బతి న్నాయి. వంతెనలు కూడా శిథిలావస్థకు చేరాయి. అక్రమ ఆదాయంపై ఉన్న శ్రద్ధ రైతుల అవసరాలపై దృష్టి సారించకపో వడం గమ నార్హం. ప్రస్తుతం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలో సాగునీటి పథకాలకు మహర్దశ పట్టనుందని రైతులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

నీరివ్వని సూరంపాలెం కాలువ

సూరంపాలెం కాలువ నుంచి అడపాదడపా వచ్చే నీరు గత కొనేళ్లుగా రైతుల చెంతకు చేరడం లేదు. దీనికి ప్రధాన కారణం కాలువలో పూడిక పనులు చేపట్టక పోవ డమే. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కాలువ ఒక టుందనే సంగతినే పూర్తిగా విస్మరించింది. 2006 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు వల్ల గంగవరం, గోకవరం, కోరుకొండ మండలాల్లోని 20 గ్రామాలకు సాగు నీరు చేరుతుంది. సుమారు 38 కిలోమీటర్ల మేర సూరం పాలెం ప్రధానకాలువ విస్తరించి ఉంది. ఇంత ప్రాధాన్యత ఉన్న కాలువలో పూడికతీత పనులను అధికారులు మరవ డంతో రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు.



మల్లవరం..మాటేలేదు..

ఏలేరు రిజర్వాయరు నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తెచ్చి మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దే శంతో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే (ప్రస్తుతం కూటమి ఎమ్మెల్యే) జ్యోతుల నెహ్రూ 2018లో తెచ్చిన పథకమే మల్లవరం ఎత్తిపోతల పథకం. సుమారు 20 శాతం పనులు పూర్త య్యాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం రివర్స్ టెండరింగ్ పేరిట పథకాన్ని అటకెక్కించారు. ప్రస్తుతం ఈ సాగు, తాగు నీటికి పథకానికి సం బంధించి పూర్తి సామగ్రి ఇప్పటికీ అలాగే మూలుగు తుంది. ఎమ్మెల్యే నెహ్రూ హయాంలో రూ.132.79 కోట్లు వ్యయంతో మంజూరైన ఈ పథకం పనులు పూర్తయితే గంగవరం,జగ్గంపేట, గోకవరం మం డలాల్లోని 7 గ్రామాల్లో సుమారు 9,300 ఎకరాలకు సాగునీటితో పాటు, పలు గ్రామాలకు తాగునీరు కూడా అందుతుంది.

నిరుపయోగంగా మారిన.సూరంపాలెం ప్రాజెక్టు



పట్టని..పురుషోత్తపట్టణం



1638 కోట్లతో నిర్మించిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు ప్రాంతం

సీతానగరం, జూన్ 27 : 1638 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు అది.. ఆ ప్రాజెక్టు,రైతులు చేసుకున్న పాపం ఏమిటంటే.. చంద్రబాబు నాయుడు హయాంలో పూర్తికావడమే.. కేవలం ఎన్‌జీటీ అనుమతులు లేవంటూ ఆ ప్రాజెక్టు వైపే చూడలేదు. ఇదీ జగన్ కక్షపూరిత ధోరణికి ఇదొక నిదర్శనం. 2017వ సంవత్సరంలో జలసిరి హారతి పథకంలో భాగంగా 28 ఇరిగేషన్ ప్రాజెక్టులను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తలపెట్టింది. వాటిలో పురుషోత్తపట్నం ఒకటి. ఇది 2.15 లక్షల ఎకరాలకు సాగునీరు, విశాఖ వాసులకు తాగునీరందించాలన్న ఉద్దేశంతో రూపుదిద్దుకుం ది.రాజానగరం, జగ్గంపేట,పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు మండలాలకు పోలవరం కెనాల్ ద్వారా 20 వేల ఎకరాలు, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 67 వేల ఎకరాలు వ్యవసాయ భూములకు నేరుగా సాగునీరందించేలా రూపకల్పన చేశారు. పోలవరం చానల్ ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు నీరు మళ్లించి అక్కడ నుంచి దగ్గరలోని చెరువుల్లోకి నీటిని నిల్వ చేస్తారు. ఈ మేరకు 10 పంపులను పురుషోత్తపట్నం పంపింగ్ స్కీం వద్ద ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పంపు 350 టీఎంసీల నీటిని విడుదల చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేశారు.1638 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించి ఆగస్టు 15న ఫస్ట్ ఫేజ్‌లో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2 పంపులను ప్రారంభించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు లేవని ఎన్‌జీటీలో పిటిషన్ దాఖలు కావడంతో పంపింగ్ స్కీమ్‌ను నిలిపివేసారు. ఈ కేసును గతేడాది విచారించిన సుప్రీంకోర్టు రూ 2.48 కోట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి చెల్లించాలని ఆదేశించింది. నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయలేదు. దీంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి పూర్వవైభవం వస్తుందని మెట్ట ప్రాంత రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

మల్లవరం ఆశలపై నీళ్లు చల్లిన వైసీపీ పాలకులు

మల్లవరం ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే మెట్ట ప్రాంతమైన గోకవరం, గంగవరం, జగ్గంపేట మండలా ల్లోని పలు ప్రాంతాలు వ్యవసాయం పరంగా ఎంతో అభివృద్ధి చెందేవి. ప్రస్తుత ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృషితో 2019కి ముందు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం మంజూరైంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో అటకెక్కించింది. దీంత మా ఆశలన్నీ అడియాసలయ్యాయి. - ఇడుదల అర్జునరావు, మాజీ ఎంపీటీసీ, మల్లవరం.



95 శాతం పూర్తయిన ముసురుమిల్లి ప్రాజెక్టు గాలికొదిలేశారు

సుమారు 20 ఏళ్ల కిందట శంకుస్థాపన చేసిన ముసురుమిల్లి ప్రాజెక్టును పాలకులు గాలికొదిలేశారు. సుమారు 95 శాతం పనులు పూర్తి చేసుకున్న ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.5 కోట్లు ఖర్చు చేస్తే వేలాది ఎకరాలకు సాగునీరందుతోంది. కానీ ఆ దిశగా ఏఒక్కరూ ఆలోచించడంలేదు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ ప్రాజెక్టుపై దృష్టి సారిస్తే సుమారు ఐదు మండలాల రైతులకు మేలు చేసినవారవుతారు.

-చింతల రామకృష్ణ, గోకవరం, రైతు



1న ఇంటికే పింఛన్లు

- జిల్లాలో 2,44,302 మంది పింఛనుదారులు
- ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం,జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను వచ్చే నెల ఒకటో తేదీ ఉదయం 5 గంటల నుంచే ఇంటింటికీ పంపిణీ చేసే ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ, ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, సమీకృత ధ్రువపత్రాలు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో 2,44,302 మందికి రూ.165 కోట్ల 13 లక్షల 29 వేల 500 పంపిణీ చేస్తున్నామన్నారు.ఈసారి వలంటీర్లకు బదులుగా సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ పంపిణీ చేస్తారన్నారు. సీఎఫ్ఎంఎస్ ఐడీ కలిగిన ఉద్యోగుల వివరాలు మ్యాపింగ్ చేస్తున్నామని, 29వ తేదీన బ్యాంకు నుంచి పింఛన్ సొమ్ము డ్రా చేస్తామన్నారు. లబ్ధిదారులకు పింఛన్ ఇచ్చిన వెంటనే రశీదు తీసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి కనీసం 50 పింఛన్లు ఇవ్వాలన్నారు. ఆధార్ బేస్డ్ విధానంలో పింఛన్లు పంపిణీ చేస్తారని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్టు చెప్పారు. బయోమెట్రిక్, ఐరిష్, ఫేస్ గుర్తింపు వంటి విధానాల్లో పింఛన్ల పంపిణీ జరగాలన్నారు. ఉద్యోగుల సేవలు వినియోగించుకునే అధికారం మునిసిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో తహశీల్దార్లు అందరూ రైస్ కార్డు ఆధారంగా సమీకృత ధ్రువపత్రాలు జారీ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 1,12,869 మందికి చెందిన సమీకృత ధృవపత్రాలు జారీ చేయవలసి ఉందన్నారు. ఆర్డీవోలు సమన్వయం చేసుకుంటూ వీఆర్వోల ద్వారా రోజుకు కనీసం 50 ధ్రువపత్రాలు పరిశీలించి ఆర్ఐల ద్వారా తహశీల్దార్ లాగిన్‌లోకి అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీ ఎస్.మూర్తి, డీఆర్వో జి.నరసింహులు, డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, వి.శాంతమణి, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి,జి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

124 టన్నుల పంచదార వెనక్కి

- టన్నున్నర కందిపప్పు కూడా - కాటా తేడా కారణం
- వచ్చే నెల బియ్యం ఒకటే పంపిణీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పౌరసరఫరాల సంస్థ జిల్లాలో రేషన్, ఐసీడీఎస్ నిమిత్తం సరఫరా చేస్తున్న పంచదార,కందిపప్పు పలు రకాల నిత్యావసరాలు పంపిణీ చేస్తుంది. పంచదార, కందిపప్పు తూకాల్లో తేడాలు గమనించిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వంలోని కాంట్రాక్టర్లపై కేసు పెట్టడంతో పాటు సరుకు జిల్లాల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటుంది. జిల్లాలో 124.5 టన్నుల పంచదారను తిరిగి పంపించేశారు. కోరుకొండలో ఐసీడీఎస్‌కు సంబంధించి 1.5 టన్నుల కందిపప్పులో తేడా ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని అక్కడ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు. ఈ పరిస్థితుల్లో జూలై నెల రేషన్‌లో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేయనున్నారు. జూలైలో ఇవ్వవలసిన పంచదార,కందిపప్పు కూడా ఆగస్టు నెలలో రెండు నెలలది ఇవ్వనున్నారు.వైసీపీ ప్రభుత్వంలో కాటా కోటాలో తేడాలతో పాటు, గత అక్టోబరు నుంచి కందిపప్పు కూడా ఇవ్వని సంగతి తెలిసిందే.

రంగు..పడలే!

నిడదవోలు, జూన్ 27 : ఆదర్శానికి అర్థంగా కూటమి ప్రభుత్వం నిలిచింది. మంచి నిర్ణయంతో అందరిచేత శెహబాస్ అనిపించుకుంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో తయారైన జగనన్న కిట్టును అచ్చంగా అలాగే విద్యార్థులకు అందజేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో 10వ తరగతి తెలుగువాచకంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు అమరావతి అనే పాఠ్యాంశాన్ని చేర్చారు.నాడు పుస్తకాలు ముద్రించేశారు. అయితే అమరావతి అనే పదాన్నే ఇష్టపడని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు అమరావతి పాఠ్యాంశం లేకుండా మళ్లీ పుస్తకాలు ముద్రించి పంపిణీ చేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల నిర్ణయంతో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సిద్ధమైన విద్యాకానుకను యధావిధిగా విద్యార్థులకు అందించి తమ పాలన గొప్పతనాన్ని చాటుకున్నారు.ప్రజాధనం వృథాకాకుండా చూశారు. జిల్లాలోని 19 మండలాల్లో ఉన్న 986 పాఠశాలల్లో 49,348 బాలురు, 54,074 బాలికలు మొత్తం 1,03,422 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా విద్యార్థులందరికీ కూటమి ప్రభుత్వ పెద్దలు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. అయితే వైసీపీ పాలనలో తయారైన జగనన్న కిట్లను అచ్చంగా అలాగే పంపిణీ చేయడంతో అంతా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం వారు తమ రంగులతో పథకాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుంది..గత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే బడులను వదల్లేదు.. సచివాలయాలను వదల్లేదు.. చివరికి మంచినీటి ట్యాంకులు.. కరెంటు స్తంభాలు.. సచివాలయాలు.. వంతెనలు..అన్నింటినీ వైసీపీ రంగులే.. చివరికి పాస్ పుస్తకాలు, దస్తావేజులపై కూడా జగన్ బొమ్మ ఉండేలా చూసుకున్నారు. ఎంత ప్రజాధనం వృథా అయినా పరవాలేదనేది వైసీపీ లెక్క.. అయితే ఒక్క రూపాయి కూడా వృథా కాకూడదనేది కూటమి లెక్క..కూటమి అధికారం చేపట్టి 20 రోజులైనా గత ప్రభుత్వ రంగులతో ఉన్న విద్యా కానుక కిట్లనే పంపిణీ చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూశారు. చంద్రబాబు నిర్ణయానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు చెప్పారు.

- ప్రజాధనం వృథా చేయని కూటమి
- జిల్లాలో 986 పాఠశాలలు
- 1,03,422 మంది విద్యార్థులు
- గత ప్రభుత్వ రంగులతోనే కిట్
- ఆశ్చర్యపోతున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వ తీరుకు అభినందనలు

ప్రజాధనం వృథా కాకూడదనే : మంత్రి దుర్గేష్

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా వైసీపీ ప్రభుత్వంలో సిద్ధం చేసిన స్కూల్‌బ్యాగ్స్, బుక్స్‌తో కూడిన స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థులకు అందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు గత ప్రభుత్వ విద్యా కానుక..కూటమి ప్రభుత్వంలో పేరు మార్చిన స్టూడెంట్ కిట్స్‌ను యధావిధిగా అందించి మాట్లాడారు.వైసీపీ రంగులతో అచ్చు వేయించిన ఉన్న బ్యాగ్‌లను యధావిధిగా పంపిణీ చేశామని చెప్పారు. పార్టీలు వేరు, రాజకీయాలు వేరు..ప్రభుత్వమనేది నిరంతర ప్రక్రియ అన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తరువాత కూడా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. స్టూడెంట్ కిట్ అనేది గత ప్రభుత్వంలో నిర్ణయమని..మా కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగించామన్నారు. రాజకీ యంగా బేదాభిప్రాయాలు ఉండవచ్చు..ప్రజలకు మేలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెరుకూరి పద్మ మాట్లాడుతూ మన ఆహ్వానాన్ని మన్నించి పాఠశాలకు విచ్చేసిన గౌరవనీయులు ప్రియతమ మంత్రివర్యులు సురేష్ గారికి హృదయ పూర్వక స్వాగతమంటూ ఉపన్యసించడంతో అంతా ఉలికి పాటుకు గురయ్యారు.నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పేరు.. ఆమెకు తెలియకపోతే ఎలా అంటూ గుసగుసలాడుకున్నారు.




గత వైసీపీ ప్రభుత్వంలో తయారైన రంగుల బ్యాగ్‌లనే విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌గా అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నన్నయ వర్సిటీలో దోపిడీ.. నాలుగు రోజుల్లో బయటపెడతా

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ, జూన్ 27 : నన్నయ వర్సిటీలో భయంకర దోపిడీ జరిగిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు.నన్నయ వర్సిటీ అక్రమాల పుట్టగా తయారైందన్నారు.ఈ భాగోతాన్ని నాలుగు రోజుల్లో మీడియా ముందుంచుతానన్నారు. దీనిపై సమగ్ర నివేదికను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అం దజేస్తామని తెలిపారు. యూనివర్సిటీ లంచాలమయంగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కీలకమైన విభాగాల్లో తన సొంత మనుషులను పెట్టుకుని నిధులు మళ్లించారని ఆరోపించారు. విద్యార్థుల కట్టిన కోట్లాది రూపాయల ఫీజు పక్కదారి పట్టిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో చేసిన పనులకు రూ.216.17 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే అంచనాలు రూపొందించామని తెలిపారు.కూటమి ప్రభుత్వంలో 3 నెలల్లో ఇబ్బందులను అధిగమించి నియోజకవర్గాలను అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్, డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.రియల్ ఎస్టేట్ దొంగలను వదలమన్నారు.పోలీసులను అడ్డుపెట్టుకుని సాగించిన అక్రమాలు వెలికితీస్తామన్నారు.కోరుకొండ భూముల విషయం సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



మాధవీలత వీడ్కోలు సభలో ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్, ఎస్పీ జగదీశ్, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు చైత్రవర్షిణి, శ్రీవాత్సవ

మాధవీలతకు ఘన వీడ్కోలు

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, జూన్ 27 : జిల్లా కలెక్టర్‌గా తాను పనిచేసిన 26 నెలల్లో ప్రజలు, అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేని ఘట్టం అని రిలీవైన కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత అన్నారు. స్థానిక పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం రాత్రి కలెక్టర్ మాధవీ లతకు వీడ్కోలు పలికారు. దీనిలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ జిల్లాతో నాకు ఎంతో అనుబంధం ఏర్పడిందన్నారు.జిల్లాకు తొలి కలెక్టర్‌ను కావడంతో అణువణువు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్ భరత్, ఎస్పీ పి.జగదీష్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి. నరసింహులు, ఆర్డీవో చైత్రవర్షిణి తదితరులు హాజరయ్యారు.

ఏపీపీజీసెట్ -2024 ఫలితాలు విడుదల 7



నిలిచిపోయిన పర్యాటక బోట్లు

పెరుగుతున్న గోదావరి

పాపికొండల విహారయాత్ర బోట్లు నిలుపుదల

దేవీపట్నం, జూన్27: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో గోదావరి నెమ్మదిగా పెరుగుతోంది. దీనికి తోడు తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి నీటి మట్టం మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తుంది. గోదావరి పెరుగుదల, తుఫాన్ కారణంగా పాపికొండలు విహార యాత్ర తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. అయితే మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నేటి నుంచి నాదెండ్ల మనోహర్ పర్యటన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 27: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్ర, శనివారాలలో కాకినాడలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, పౌరసరఫరా సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ ద్వారా రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, కార్డుదారులతో సమావేశమవుతారు. జిల్లాలో రబీ సీజన్‌లో చేపట్టిన ధ్యానం సేకరణ, కనీస మద్దతు ధర చెల్లింపు తదితర అంశాలపై ఆయా శాఖల సంబంధిత అధికారులు, రైతులతో మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం నిర్వహిస్తారు. గురువారం రాత్రి మంత్రి నాదెండ్ల కాకినాడ చేరుకున్నారు.

జాతీయ రహదారుల పనుల పురోగతిపై సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ) జూన్ 27: జిల్లాలో జాతీయ రహదారుల పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి తదితరులు రెవెన్యూ, రోడ్లు, భవనాలు, ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కాకినాడ నుంచి రాజమండ్రి వరకు నిర్మించే రహదారి, వాకలపూడి నుంచి అన్నవరం, కత్తిపూడి నుంచి అమలాపురం వరకు నిర్మిస్తున్న రహదారుల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. రహదారుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూసేకరణ సమస్యలు అధిగమించే విధంగా ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ సర్వే సమన్వయంతో పనిచేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిశోర్, సీతారామారావు, రోడ్లు, భవనాల, ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రూ. 1.25 కోట్ల విలువైన

మద్యం ధ్వంసం





మద్యం సీసాల ధ్వంసం

సర్పవరం జంక్షన్, జూన్ 27: కాకినాడ జిల్లాలో రెండేళ్ల కాలవ్యవధిలో ఎస్ఈబీ, పోలీసులు నిర్వహించిన దాడులు, తనిఖీల్లో పట్టుబడిన సుమారు రూ. 1.25 కోట్ల విలువైన 32 వేల లీటర్ల మద్యం బాటిల్స్‌ను గురువారం ధ్వంసం చేశారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో గురువారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్పీ,సెబ్ శ్రీలక్ష్మి పర్యవేక్షణలో పోలీసులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం, అక్రమ నాటుసారా రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు చెప్పారు. ఎస్ఈబీ, పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాడులు, తనిఖీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. రెండేళ్ల కాలవ్యవధిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా రవాణా అవుతున్న 94,737 మద్యం బాటిల్స్, 12,532.45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు సెబ్, పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో 32 వేల లీటర్ల మద్యం బాటిల్స్, నాటు సారాను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ జె.రామ్‌కుమార్, కాకినాడ ఎస్డీపీవో కె.హనుమంతరావు, పలువురు సెబ్, లా అండ్ ఆర్డర్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో పలువురికి పది లోపు ర్యాంకులు

ఏపీపీజీసెట్ -2024
ఫలితాలు విడుదల
సత్తాచాటిన విద్యార్థులు

కాకినాడ రూరల్, జూన్ 27: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీజీ కళాశాలల్లోని సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఏపీపీజీసెట్-2024 ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో పదిలోపు ర్యాంకులు సాధించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటకు చెందిన బాలచంద్ర పటి బీఏఏలో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకును సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన కేదరి శ్రీసాయివినయ్ 2వ ర్యాంకు, సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన కుమ్మరి నితిన్‌సాగర్ 8వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అంతర్వేది మాధురి 10వ ర్యాంకు పొందారు. ఎంఏ ఎడ్యుకేషన్‌లో కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన దడాల అయ్యా రాజశేఖర్ 9వ ర్యాంకును, ఎఫ్ఎన్ఎస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన అద్దేపల్లి వసంతి 7వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కమ్మవారివీధికి చెందిన సత్తి బ్రహ్మవర్ధిని 12వ ర్యాంకును, కె.గంగవరానికి చెందిన నాగులాపల్లి హేమలత 12వ ర్యాంకు సాధించారు. జనరల్ సబ్జెక్టులో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన కోనమహాలక్ష్మి 6వ ర్యాంకు, హిందీలో కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలేనికి చెందిన పాలిక పూజిత 1వ ర్యాంకు, అదే ప్రాంతానికి చెందిన పాలిక సాయిసుష్మిత 6వ ర్యాంకు, హిస్టరీలో కాకినాడ రంగయ్యనాయుడు వీధికి చెందిన అడపా శ్రీసత్య 6వ ర్యాంకును, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన టీవైఎస్ ఈశ్వరరావు 6వ ర్యాంకును పొందారు. కెమికల్ సైన్సెస్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన బిక్కిన సత్యప్రియ రెండో ర్యాంకు సాధించింది. ఇంగ్లీష్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కుప్పల శ్రావ్య 11వ ర్యాంకు సాధించింది. లైఫ్ సైన్సెస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాసుల తేజో వెంకటవీణ సుష్మ 1వ ర్యాంకు సాధించింది. మేథమెటికల్ సైన్సెస్‌లో కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన మోరుకుర్తి లక్ష్మీ తేజస్విని 2వ ర్యాంకు, పెదపూడికి చెందిన కారెడ్ల శిరీష 4వ ర్యాంకు, కాకినాడ రూరల్‌కు చెందిన చోడిశెట్టి శ్రీలక్ష్మి 6వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన గుండుబోగుల హరివీర శివసత్యనారాయణ 12వ ర్యాంకు సాధించారు. ఫిజికల్ సైన్సెస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన సువ్వుల ఈశ్వర్ హరి సాయికుమార్ 12వ ర్యాంకు సాధించాడు. పొలిటికల్ సైన్స్‌లో కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన నట్టే వీరవెంకట వేణు మహేశ్వరి 3వ ర్యాంకు, సంస్కృతంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన ములకల వెంకటలక్ష్మి 9వ ర్యాంకు, స్టేటస్టిక్స్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తానికి చెందిన కేశనకుర్తి వీరవెంకట సత్యవాణి 2వ ర్యాంకు, అమలాపురానికి చెందిన రాయుడు భార్గవి సాయి ప్రజ్ఞ 7వ ర్యాంకు, తెలుగులో కాకినాడ జిల్లా కాజులూరుకు చెందిన మేడిశెట్టి శిరీషాదేవి 2వ ర్యాంకు, ఇదే ప్రాంతానికి చెందిన కొండమూరి కాశీ కృష్ణవేణి 5వ ర్యాంకు, టూరిజంలో కాకినాడకు చెందిన యతిరాజ్యు అభినయ సాయి 10వ ర్యాంకు, జువాలజీలో కాకినాడకు చెందిన కుప్పిలి భావన 9వ ర్యాంకు సాధించారు.

ఏపీఎడ్‌సెట్‌లో ప్రతిభ

ఏపీఎడ్‌సెట్ ఫలితాల్లో గణితశాస్త్రంలో కాకినాడ జిల్లా కాకినాడకు చెందిన కాకరపర్తి భావనాఫణిప్రియ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది.

శనేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



కొత్తపేట, జూన్27: మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామి ఆలయంలోని హుండీలు గురువారం తెరిచి కానుకలను లెక్కించారు. శనేశ్వరస్వామికి హుండీల ద్వారా రూ.2.94లక్షలు, ఆలయ ప్రాంగణంలో గల వేణుగోపాల స్వామికి హుండీలద్వారా రూ.13,072, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.8,784 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. ప్రత్యేకాధికారి వీవీవీఎస్ కామేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చింతా విజయకృష్ణ మోహన్, సిద్దంశెట్టి వీర వెంకటసత్యనారాయణ, వీఆర్వో ఉత్తరకుమారి, సాదు చెంచయ్య ఆర్యవైశ్య సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లి ఆదాయం రూ.1.71 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,71,407 లభించినట్టు ఈవో, ఉప కమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అన్నదాన ట్రస్టుకు పలువురు దాతలు విరాళాలు అందజేశారు.



సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

పేదలకు మెరుగైన సేవలందించాలి

రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో మంత్రి సుభాష్ తనిఖీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 27: ప్రభుత్వాసుపత్రులకు పేదలు వస్తారని వారికి మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిని మంత్రి సుభాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలు దాటితో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, దీంతో ప్రాథమిక చికిత్స జరగడం లేదని కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి వైద్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రక్త తదితర పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లకు సిఫార్సు చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. మంత్రి రికార్డులు పరిశీలిస్తుండగా ప్రైవేటు ల్యాబ్‌ల లెటర్‌ప్యాడ్స్ కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమిటిది ఏం జరుగుతుందని మండిపడ్డారు. వెంటనే సెకండరీ హెల్త్ డైరెక్టరుకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో సామాన్యులను ఇబ్బంది పెట్టొద్దు, అన్ని రకాల పరీక్షలు ఆసుపత్రిలో నిర్వహించాలని ఆదేశించారు. సామాన్య రోగులను ఇబ్బంది పెడితే సహించబోనన్నారు. జనరిక్ మందులు షాపులో బయట మందులు పెట్టి అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఫిర్యాదుపై మందుల షాపును పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో బయట మందులు వైద్యులు సిఫార్సు చేయవద్దని, అన్ని రకాల మందులు జనరిక్ షాపులో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాని వారిని తొలగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో పలువార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మంత్రి సుభాష్ మాట్లాడారు. బ్లడ్ బ్యాంకు, ల్యాబ్ ఇతర వార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియామక ప్రక్రియ చేపట్టగానే పోస్టుల భర్తీ చేస్తామని తెలిపారు. జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, రవ్వా భూషణం, శివ, టేకుమూడి సత్యనారాయణ, మేడిశెట్టి శేషారావు జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1753 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానం

ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి రూ.13.93 కోట్ల లాభాలు
కాకినాడ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర

కాకినాడ సిటీ, జూన్ 27: రాష్ట్రంలో 46 సహకార కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులుండగా, కాకినాడ కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ రూ.1753 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానంలో ఉందని, ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ 13.93 కోట్ల లాభాలను ఆర్జించిందని బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు 45వ వార్షిక ఆడిట్ నివేదిక వివరాలను వెల్లడించారు. వినియోగదారుల సౌకర్యార్థం రానున్న కాలంలో నర్సీపట్నం, నూజివీడు, విజయనగరం, శ్రీకాకుళం, భీమవరం, పిఠాపురంలో నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ.1,056.73 కోట్లు డిపాజిట్లు, రూ 696.47 కోట్ల రుణాలు, రూ.447.35 కోట్లు ఇన్‌వెస్ట్‌మెంట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే బ్యాంకు రూ.172.13 కోట్ల సొంత నిధులు కలిగి ఉందన్నారు. బ్యాంకుకు 53 వేల 360 మంది సభ్యులు రూ.30.37 కోట్ల వాటా ధనం కలిగి ఉన్నారని, ఈ ఏడాది ఒక్కో సభ్యునికి 15 శాతం డివిడెండ్ ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదించిందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.1,000 కోట్లు దాటడంతో రిజర్వ్ బ్యాంకు వారు టౌన్ బ్యాంక్ టైర్-త్రీ బ్యాంక్‌గా గుర్తించిందన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం బ్యాంక్ తర్వాత కాకినాడ టౌన్ బ్యాంక్ మాత్రమే టైర్-త్రీ బ్యాంక్‌గా ఉందన్నారు. అదే విధంగా ప్రతి ఖాతాదారుడు పాన్ కార్డు, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని, దీని నిమిత్తం బ్యాంకు ఎటువంటి రుసుం వసూలు చేయదన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్‌చైర్మన్ తోట సుధీర్, డైరెక్టర్లు కంటిపూడి సత్యనారాయణ, రిమ్మలపూడి ధర్మేంద్ర, సీఈవో సి.సుగుణరావు, సహ సీఈవో బీఎస్‌వీ సుహాస్ పాల్గొన్నారు.

మరో ఇద్దరికి డయేరియా



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

రంగంపేట, జూన్ 27: రంగంపేట మండలం ఈలకొలను గ్రామం శివారు అచ్యుతాపురంలో డయేరియా ప్రబలడంతో గురువారం మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారికి వైద్య సేవలందించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు అసుపత్రికి పంపించినట్టు రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి అత్యవసర వైద్య విభాగ బృందం వైద్యులు రాజీవ్, సుధీర్, మెడికల్ కళాశాల వైద్యాధికారులు, టెక్నికల్ సిబ్బంది గ్రామంలో పర్యటించి వాటర్ ట్యాంక్‌లను, పైపులైన్‌లను, డ్రైనేజీ, శానిటేషన్ పనులను పరిశీలించారు. వాటర్, బాధితుల మలం శాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, డీఎల్‌పీవో ఎం.నాగలత, ఈవోపీఆర్డీ టి.వెంకటరత్నం గ్రామంలో పర్యటించి శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మి, చిన్నారావు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. పారామెడికల్ సిబ్బంది నాలుగు టీమ్‌లుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మాంసాహారాలు తినవద్దని, వండిన ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని సూచించారు. బుధవారం డయేరియాతో అస్వస్థతకు గురైన ఆరుగురు పూర్తిగా కోలుకున్నారని, గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉందని డాక్టర్ వేణుశ్రీలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, ఎంపీహెచ్ఎస్ పి.రాజేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సీనియర్ విద్యార్థుల దాడితో మనస్తాపం

బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న శివగంగాధర్

ప్రత్తిపాడు, జూన్ 27: సీనియర్ విద్యార్థులు దాడి చేయడంతో అవమాన భారంతో ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ప్రత్తిపాడులోని ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒమ్మంగి గ్రామానికి చెందిన కంచి శివగంగాధర్ గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు బస్సులో వెళుతుండగా అదే కళాశాలలో చదువుతున్న కొంత మంది సీనియర్ విద్యార్థులు పోలీసులమని చెప్పి బస్సు దింపి కారులో ఎక్కించుకుని చేబ్రోలు తీసుకెళ్లి దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. ఎందుకు కొట్టారో తెలియక అవమాన భారంతో ఒమ్మంగి వచ్చి బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న శివను ప్రత్తిపాడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. దీంతో బాధితుడు మేనమామ పెనుమాకుల శివ గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి, జూన్27: జాతీయ రహదారిపై జెడ్.రాగంపేట డివైడర్ వద్ద గురువారం లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానిక పోలీసులు సమాచారం ప్రకారం మల్లేపల్లి గ్రామానికి చెందిన చంద్రపాటి లోవరాజు(44) పనికి వెళ్లి జగ్గంపేట వైపు నుంచి మల్లేపల్లి వస్తుండగా జెడ్.రాగంపేట వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి లోవరాజుపైకి ఎక్కడంతో ఆయన శరీరం లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జైంది. అతని సొంతూరు లింగంపర్తి కాగా మల్లేపల్లిలో అత్తారిల్లి కాపురం ఉంటున్నాడు. లోవరాజుకు భార్య, కొడుకు ఉన్నారు. ఏఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మాలకొండయ్య

అంబాజీపేట, జూన్ 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న వి.మాలకొండయ్యకు మెరిటోరియస్ ఎంప్లాయీస్ అవార్డును ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అందించారు. తాడేపల్లిగూడెం సమీపంలోని వెంకటరామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును, రూ.2,500 నగదు, ప్రశంసాపత్రాన్ని కొండయ్యకు అందించారు. కొండయ్యను స్థానిక పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎస్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష, ఎ.కిరిటీ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఆలమూరు, జూన్ 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన కొక్కిరిమెట్ల గాంధారమ్మ (112) గురువారం మృతి చెందారు. ఈమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా ముగ్గురు కుమార్తెలు జీవించి ఉన్నారు. మనుమలు, మనుమరాండ్లు, మునిమనుమలు, మునిమనుమరాళ్లు కలిపి 120 మంది ఉన్నారు. గాంధారమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

గాయపడిన కొండచిలువకు ఆపరేషన్..మృతి



ఆపరేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు, జూన్27: గుర్తుతెలియని వాహనం పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ కొండచిలువను బతికించేందుకు పశు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ కొండచిలువ మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో రోడ్డు మార్గం దాటుతున్న కొండచిలువపై గుర్తు తెలియని వాహనం దూసుకువెళ్లింది. దీంతో కొండచిలువ తీవ్రంగా గాయపడింది. ఏలేశ్వరం అటవీ శాఖ సిబ్బంది బుధవారం ప్రత్తిపాడు పశువుల ఆసుపత్రికి ఆ కొండ చిలువను తీసుకొచ్చారు. స్థానిక పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ బాలచంద్రయోగేశ్వర్, పశువైద్యాధికారి సతీష్‌కుమార్ బృందం ఈ కొండ చిలువకు ఆపరేషన్ చేసి కుట్లు వేశారు. ఆపరేషన్ అనంతరం దాని సంరక్షణ కోసం రాజమహేంద్ర వరంలో అటవీ శాఖ పునరావాస కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ ఈ కొండ చిలువ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో ఆ కొండ చిలువకు ఏలేశ్వరం ఫారెస్ట్ శాఖకు చెందిన ఎఫ్ఆర్ఓ దుర్గారాంప్రసాద్, సిబ్బంది ఏలేశ్వరం తరలించగా గురువారం సాయంత్రం ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బాలచంద్రయోగేశ్వర్, పశువైద్యాధికారి సతీష్‌కుమార్ బృందం పోస్టుమార్టం నిర్వహించింది. అనంతరం మృతి చెందిన కొండ చిలువను నిర్మానుష్య ప్రదేశంలో ఫారెస్ట్ సిబ్బంది పూడ్చివేశారు. కొండ చిలువ ప్రాణాలు కాపాడటానికి అటవీ శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు శ్రమించినప్పటికీ ఫలితం దక్కలేదు.

రామోజీరావు విగ్రహం అందజేత

విగ్రహాన్ని రూపొందించిన మాధవరావు



విగ్రహాన్ని నారా లోకేశ్‌కు అందిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జూన్ 27: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు విగ్రహాన్ని తయారుచేసిన ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన శిల్పి పెద్దిరెడ్డి మాధవరావు గురువారం రామోజీరావు కుటుంబ సభ్యులకు విగ్రహాన్ని అందజేశారు. విజయవాడలోని కానూరులో గురువారం జరిగిన రామోజీరావు సంతాప సభలో తాను రూపొందించిన రామోజీరావు విగ్రహాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రామోజీరావు కుటుంబ సభ్యులకు పెద్దిరెడ్డి మాధవరావు, అతని కుమారుడు రవీంద్ర అందజేశారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు పూర్తి

దివాన్‌చెరువు, జూన్ 27: ఏపీ ఆర్‌సెట్‌లో అర్హత సాధించిన జియాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని స్థానిక ప్రాంగణంలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు గురువారం పూర్తయినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. మేనేజ్‌మెంట్ విభాగంలో 321 మంది విద్యార్థులకు గాను 261 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. అలాగే జియాలజీ స్కాలర్‌లు ఈ నెల 24న నిర్వహించిన ఇంటర్వ్యూలకు 34 మంది విద్యార్థులకు గాను 25 మంది హాజరయ్యారన్నారు. సెట్ కన్వీనర్ సూచనల మేరకు ఎంతో పారదర్శకంగా జియాలజీ, మేనేజ్‌మెంట్ ఆచార్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

'రుణాల మంజూరులో గిరిజనులపై చిన్నచూపు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు

వై.రామవరం, జూన్27: మండలంలో వెలుగు రుణాలు అందరికీ అందడం లేదని సిబ్బంది తమకు అనుకూలమైన వారికే మళ్లీ మళ్లీ రుణాలు మంజూరు చేసి కొందరు గిరిజనుల పట్ల చిన్న చూపు చూస్తున్నారని మండల సమావేశంలో ఉపాధ్యక్షుడు ముర్ల జోగిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వెలుగు రుణాలపై స్పందించిన ఎంపీపీ ఆనందరావు మాట్లాడుతూ సమావేశానికి కింది స్థాయి సిబ్బందిని అరకొర సమాచారంతో పంపిస్తున్నారని సంబంధిత ఏపీఎం సమావేశానికి హాజరుకాకపోవడం సరికాదని అన్నారు. రుణాల మంజూరులో తమకు ఎటువంటి సమాచారం అందించకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో కూలీలకు పేమెంట్లు సక్రమంగా అందడం లేదని పనిదినాలు కూడా కల్పించడం లేదని సభ్యులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. వరివిత్తనాలను సబ్సిడీపై సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. వై.రామవరం నుంచి గుర్తేడుకు రోడ్డు నిర్మాణంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఇప్పటికైనా గుర్తేడు రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. సమావేశంలో విద్య, వైద్య, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూన్27: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు పవన్‌ప్లాంట్‌లో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. గురువారం ఏపీ జెన్కో ఉన్నతాధికారి ఎస్ఎస్ మేరా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో రంపచోడవరం అగ్నిమాపక సిబ్బంది పొల్లూరు పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొల్లూరు ప్లాంట్ ఉద్యోగులు, ఉన్నత అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేసిన దృశ్యం

రంపచోడవరం, జూన్ 27: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదేశాల మేరకు మండలంలోని ఐ.పోలవరం రైతు భరోసా కేంద్రంలో 90 శాతం రాయితీతో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు తెలిపారు.ఆర్‌జెఎల్-667, ఎంటీయూ (1061)-267,ఎంటీయూ(1064)-835, ఎస్ఎల్ఆర్ (34449)-104, బీపీటీ(5204)-248, ఎంటీయూ (1121)-500, మొత్తం 853.1 కింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీపీ బంధం శ్రీదేవి, సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు బంధం పోతన్నదొర, కంగల రామలత, సూరిబాబు, వార్డు మెంబర్లు రాజన్నదొర, ఏవో లక్ష్మణరావు, టీడీపీ నాయకులు చవలం బాపన్నదొర, కుంజం బాపన్నదొర, కంగల అబ్బాయిదొర పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీవో, సబ్ కలెక్టర్



కలెక్టర్‌ను కలిసిన అధికారులు

రంపచోడవరం, జూన్ 27: అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన ఏఎస్ దినేష్‌కుమార్‌ను పాడేరులో గురువారం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టరు రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వై.రామవరం, జూన్27: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో కె.బాపన్నదొర హెచ్చరించారు.జూలై 1 నుంచి చేపడుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది అందరూ పాల్గొనాలని ఎవరికి ఎటువంటి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. మండలంలో మొత్తం 3,371 పింఛన్‌దారులకు పెంచిన పింఛన్ల సొమ్ము రూ.2 కోట్ల 30 లక్షలు విడుదల కానున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో 17 పంచాయతీల్లో 139 మంది సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి సాయం

మారేడుమిల్లి, జూన్ 27: కార్యకర్తలకు అండగా ఉంటానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు కత్తుల పెదరాజారెడ్డి ఇటీవల మృతిచెందారు. గురువారం మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ పందిరిమామిడికోట గ్రామంలో రాజారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మండల టీడీపీ నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టరు పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గురుకు శేషకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు భీశెట్టి అప్పాజీ, బీజేపీ మండలాధ్యక్షుడు రేవుల రామకృష్ణారెడ్డి, ఎండీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూమి పండుగ

కూనవరం, జూన్27: మండలంలోని రేపాక గ్రామంలో గిరిజనులు సంప్రదాయబద్ధంగా భూమి పండుగ నిర్వహించారు. గ్రామ పొలిమేరలో ఉన్న గిరిజన దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం విత్తనాలను భూమిలో వేశారు. గిరిజన మహిళలు రోడ్లపైకి వచ్చి నృత్యాలు చేస్తూ విరాళాలు సేకరించగా పురుషులు అడవికి వేటకు వెళ్లారు.



నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిక్కవోలు, జూన్ 27: మండలంలోని పందలపాక సబ్‌స్టేషన్ పరిధిలో వైర్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పందలపాక, కొంకుదురు, తొస్సిపూడి, ఆరికరేవుల, మెర్లారు, కొమరిపాలెం, బిక్కవోలు సబ్ స్టేషన్ పరిధిలో బిక్కవోలు, ఊలపల్లి, రంగాపురం, నల్లమిల్లి, మర్రిపూడి, బలభద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో కాపవరం, జి. పాకలు గ్రామాల్లో పరిశ్రమలకు, గృహ వినియోగదారులకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

కూటమి కార్యకర్తల రుణం తీర్చుకోలేం

- కష్టపడిన వారిని గుండెల్లో పెట్టుకుంటాం
- మూడు పార్టీలది ఒకటే మాట..ఒకే బాట
- కూటమి ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి కష్టపడిన ప్రతి ఒక్కరినీ గుండెల్లో పెట్టుకుంటామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్‌రోడ్డులోని చెరుకూరి కన్వెన్షన్‌లో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఎన్‌డీఏ కూటమి ఆత్మీయ సమావేశంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెం టనే పారిశుధ్యంపై దృష్టిపెట్టానన్నారు. కొంతమంది అధికారుల్లో ఇంకా పాత వాసనలు పోవడం లేదన్నారు. వారంతా మారాలని సూచించారు. బ్లేడుబ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామన్నారు. వైసీపీ నాయకుల అండతో రెచ్చిపోతున్న బ్యాచ్‌లు ఆలోచించుకుని పూర్తిగా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కూటమి విజయానికి పనిచేయకుండా కొంతమంది ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మూడు పార్టీల్లో ఏదొక పార్టీలో చేరి చెలాయించాలంటే కుదరదని చెప్పారు. ఏ పార్టీలో చేరికలు ఉన్నా మూడు పార్టీల అధ్యక్షులు కలిసి చర్చించుకుని నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం 42 డివిజన్లలో ఎవరెవరు కూటమి విజయానికి కష్టపడి పనిచేశారో తనకు తెలుసునన్నారు. కష్టపడిన వారికి ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందన్నారు. మా కుటుంబాన్ని ఆదరిస్తున్న రాజమహేంద్రవరం ప్రజలకు సదా రుణపడి ఉంటామన్నారు. అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ అద్భుతమైన విజయాన్ని అందుకున్నాం కానీ రీల్స్ స్టార్ భరత్‌కు డిపాజిట్ రాకుండా చేయలేకపోయమనే బాధ ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించారన్నారు. ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను సత్కరించారు. సుమారు 4 వేల మంది ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, యెనుముల రంగబాబు, చల్లా శంకర్రావు, కాశి నవీన్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీను, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, కుడుపూడి సత్తిబాబు, దొండపాటి సత్యంబాబు, ప్రియా సౌజన్య, రేలంగి శ్రీదేవి, మాలే విజయలక్ష్మి, యెనుముల రంగబాబు, వర్రే శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కూటమి నాయకులు, కార్యకర్తలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

సమస్య వస్తే డయల్ 86939 34567

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27: అక్కచెల్లెమ్మలకు రాజమహేంద్రవరంలో అండగా ఉంటానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. స్థానిక ఆదెమ్మదిబ్బ వాంబేకాలనీ వద్ద గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన మీ భద్రత-మా బాధ్యత కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ లన్నీ నేరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మీకు ఎటువంటి సమస్య వచ్చినా నాయకులు అందుబాటులో ఉంటారని వారు సరిగ్గా స్పందించకపోతే నేరుగా నా నెంబరు 86939 34567కు ఫోన్ చేయవచ్చన్నారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో సీఐ గౌడ్, కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, బుడ్డిగ రాధ, కరగాని వేణు, రాచపల్లి ప్రసాద్, పోలీసు అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

వరిలో విత్తనం చల్లే విధానాన్ని ప్రోత్సహించాలి

వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ప్రమీలారాణి



ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ప్రమీలారాణి

దివాన్‌చెరువు, జూన్ 27: జిల్లాలో ప్రధాన పంట అయిన వరిలో నేరుగా విత్తనం జల్లే విధానం ప్రోత్సహించాలని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు బి.ప్రమీలారాణి సూచించారు. తద్వారా సాగు ఖర్చులో ఎకరాకు రూ.6 వేలు నుంచి రూ.8 వేలు ఆదా అవుతుందన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాన్ని ప్రమీలారాణి, ఉప విస్తరణ సంచాలకుడు బి.ముకుందరావు గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేంద్రం ప్రగతి, కార్యక్రమాలను అడిగి తెలుసుకుని శాస్త్రవేత్తల పనితీరును ప్రశంసించారు. అనంతరం మాట్లాడుతూ వరిలో నేరుగా విత్తనం జల్లే దిశగా ప్రోత్సహించేందుకు అవసరమైన శిక్షణాకార్యక్రమాలు, ప్రాజెక్టు రూపొందించాలని శాస్త్రవేత్తలకు ప్రమీలారాణి అన్నారు. జిల్లాలో రైతు కమతాల్లో చిరుసంచుల ప్రదర్శనకు, క్షేత్ర ప్రదర్శనకు సంబంధించి విత్తనాల పంపిణీ సకాలంలో చేపట్టినందుకు శాస్త్రవేత్తలను ప్రశంసించారు. ఏరువాక కేంద్రం ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల ముంగిటకు చేర్చి, వారు స్థిరమైన నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు సాధించడానికి, అన్నదాతల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. మెట్టప్రాంతాల్లో అపరాలు, శెనగ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమజ్యోతి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకరరావు



విద్యా ప్రవేశం కార్యక్రమంపై మాట్లాడుతున్న ఏఎంవో గౌరీశంకరరావు

బిక్కవోలు, జూన్ 27: ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ బడి ఈడు పిల్లలందర్నీ సమాజ భాగస్వామ్యంతో బడిలో ఉంచేందుకే విద్యా ప్రవేశం కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డి.గౌరిశంకరరావు తెలిపారు. ఊలపల్లి ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమంపై గురువారం ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు. గత ఐదేళ్ల పాఠశాలలో విద్యార్థుల నమోదు విశ్లేషించి ఈ యేడాది లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోడానికి బృందాలుగా ఏర్పడి ప్రజల సహకారంతో నూరు శాతం విద్యార్థులను నమోదు చేయాలన్నారు. అనంతరం స్టెమ్ లాబ్‌ను పరిశీలించి వినియోగంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈయన వెంట హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి వున్నారు.

పని ప్రదేశంలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూన్ 27: మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక దాడులు, వేధింపులకు గురికాకుండా అరికట్టేందుకు మహిళల రక్షణ కమిటీ ఏర్పాటు చేసి నివేదిక అందజేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ తేజ్‌భరత్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరం నుంచి జిల్లాలో మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఆర్వో జి.నరసింహులుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తేజ్‌భరత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14, 15 హెచ్ ప్రకారం లింగ సమానత్వం స్త్రీల ప్రాథమిక హక్కు, ఆర్టికల్ 21 ప్రకారం గౌరంగా జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు, లైంగిక వేధింపులకు గురికాకుండా సురక్షితమైన వాతావరణం హక్కును కలిగి వున్నారని చెప్పారు. మహిళలు పనిచేసే చోట అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ రాజ్యాంగం పరిమితులకు లోబడి పని చేయాలన్నారు. ఆయా కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ యూనిట్ల డివిజనల్ లేదా సబ్‌డివిజన్ స్థాయిలో వివిధ ప్రదేశాల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసి వాటి నివేదిక అందజేయాలని ఆదేశించారు. విజయకుమారి మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశంలో నిబంధనలకు అనుగుణంగా సీనియర్ ఉద్యోగిని, ఒకవేళ ఆమె లేకపోతే అందుబాటులో ఉన్న అధికారిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలన్నారు. మహిళ భద్రత విషయంలో ప్రాధాన్యమిస్తూ కమిటి ఏర్పాటు చేయాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియ పర్యవేక్షణకు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నోడల్ అధికారిగా వ్యవహరించాలని చెప్పారు.

సాగునీటి వ్యవస్థ మెరుగునకు తక్షణ చర్యలు

- డెల్టా కాలువల్లో పనులకు రూ.20 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూన్ 27: సాగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపడుతుందని, దీని కోసం సీఎం చంద్రబాబు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామవరంలో ఇరిగేషన్ అధికారులతో సమావేశ మైన ఆయన పలు సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో రూ.1.30 కోట్లు నియోజకవర్గంలోని నల్లకాలువ, ఎర్ర కాలువలు, బ్రాంచి కెనాల్‌లలో గుర్రపుడెక్క తొలగింపునకు వెచ్చించినట్టు చెప్పారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. గత ఐదేళ్లలో డ్యామ్‌లు, స్లూయిజ్, షట్టర్ల నిర్వహణకు నోచుకోకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. త్వరలో వీటి మరమ్మతులు చేపడతామన్నారు. అలాగే పెదపూడి మండలంలో ముంపు సమస్యను తొలగించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో చర్చించామని ఎమ్మెల్యే చెప్పారు.

మూడెకరాల స్థలం చూపిస్తే 100 పడకల ఆసుపత్రి నిర్మాణం..

అనపర్తి ఏరియా ఆసుపత్రి నిర్మాణానికి మంజూరు చేసిన మూడెకరాల స్థలం చూపిస్తే ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, నిర్వహణ కమిటీ ప్రతినిధులతో సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సామాజిక ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయించేందుకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మూడెకరాల స్థలం ఉండాలన్నది నిబంధన కాగా ఆసుపత్రి స్థలం 1.09 ఎకరాలు మాత్రమే ఉందని, అయితే మంజూరు కోసం పక్కనే ఉన్న కళావేదిక స్థలాన్ని కూడా ఆసుపత్రి స్థలంగా చూపి వంద పడకలు మంజూరు చేయించారన్నారు. దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో తెలియజేయాలన్నారు. నాడు సిఫారసు చేసిన మాజీ ఎమ్మెల్యే గాని, నిర్వహణ కమిటీ గానీ మిగిలిన స్థలం చూపితే అదనపు నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. నిర్వహణ కమిటీ పేరుతో చందాలు వసూలు చేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. వీటన్నిటిపై విచారణ జరపాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందించాలని చెప్పారు. నల్లమిల్లిని డీసీహెచ్ఎస్ పద్మ శ్రీరాణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా అనపర్తిలో త్వరలో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు ఏరియా ఆసుపత్రి సిబ్బంది తరపున దుర్గాప్రసాద్ ఎమ్మెల్యే నల్లమిల్లికి రూ.10వేల విరాళాన్ని అందజేశారు. అయితే క్యాంటీన్ ఏర్పాటు వరకు ఈ విరాళాన్ని తన దగ్గరే ఉంచాలంటూ సూపరింటెండెంట్ రామగురెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు.కార్యక్రమాల్లో నాయకులు ఎస్.నాగతిరుపతిరావు, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, తేనెల శ్రీనివాస్, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, ఇరిగేషన్ డీఈ, జేఈలు, పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. స్థానిక లాలాచెరువు హైస్కూల్లో సంస్థ ఆధ్వర్యంలో మంచి, చెడు స్పర్శ, విద్యా చట్టాలపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని, గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. తద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించే అవకాశం ఉంటుందన్నారు. దేశభక్తి, సోదరభావం పొంపొందేలా మెలగాలని.. పెద్దలకు గౌరవిస్తూ మర్యాదగా నడుచుకోవాలని హితవు పలికారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న ఆహారాన్ని పరిశీలించారు. కార్య క్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లలితకుమారి, డీసీపీవో రాజ్‌కుమార్, హెచ్‌ఎం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27 : రాజమహేంద్రవరం జెఎన్‌రోడ్డులోని డి1 కన్వెన్షన్‌లో ఈ నెల 29న మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024ను నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా తెలిపారు. స్థానిక ఏవీఏ రోడ్డు పాత సోమాలమ్మ ఆలయం సమీపంలోని క్లబ్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆడిషన్స్, వచ్చే నెల 20న ఆనం కళాకేంద్రంలో గ్రాండ్ ఫైనల్స్ జరుగుతాయన్నారు. అనంతరం మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024 బ్రోచర్ ఆవిష్కరించారు. ఆడిషన్స్‌కు మిస్ ఇండియా 2023 విజేత నందిని గుప్తా హాజరవుతున్నారని చెప్పారు. సమావేశంలో రామచంద్రారెడ్డి, రేణుక నవీన్, కుమార్, జాన్, శివ పాల్గొన్నారు.

బొజ్జ తారకానికి ఘన నివాళి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27: పీడిత తాడిత ప్రజల కోసం హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జ తారకం నిరంతరం పోరాటం చేశారన్నారు. ఆయన 85వ జయంతిని గురువారం రాజమహేంద్రవరంలో న్యాయవాది ఇసుకపట్ల రాంబాబు నివాసం, ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాది కొంకి రమేష్, ఉద్యమకారుడు నక్కా వెంకటరత్నరాజు, సోమబత్తుల విజయకుమార్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి బాబ్జి, అసోసియేషన్ కార్యదర్శి పి.రవికుమార్, సీహెచ్.సుబ్బారావు,చింతా అనిల్‌కుమార్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం,జూన్ 27: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కేవీకే చైతన్య అన్నారు. గురువారం సీతానగరం పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల నీళ్ల విరేచనాలు అవుతాయన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముగిసిన కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సదస్సు



రాజమహేంద్రవరం రూరల్, జూన్ 27: రాజమహేంద్రవరం సిటీ ఆర్ఐలో జరుగుతున్న వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్-10 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సదస్సు గురువారం ముగిసింది. 3వ రోజు కార్యక్రమంలో 72 కృషి విజ్ఞాన కేంద్రాల అధిపతులు ఆటారి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, ఐసీఏఆర్ డాక్టర్ కె.మాధుర్ కడియం నర్సరీల సందర్శనకు వెళ్లారు. అనంతరం మీరా మాట్లాడుతూ భవిష్యత్‌లో నర్సరీలు ఒక ఉద్యాన హబ్‌గా మారగలవన్నారు. సదస్సు ముగింపు కార్యక్రమంలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను 1,2,3 స్థానాలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ, విత్తన -నారు మొక్కల ఉత్పత్తి, కేవీకే ఆర్థికాభివృద్ధికి విశిష్ట సేవలకు గాను యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి రోలింగ్ షీల్డ్ ప్రదానం చేశారు. సదస్సు విజయవంతానికి కృషి చేసిన సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త వై.సుబ్బయ్య వందన సమర్పణతో సమావేశాలు ముగిసాయి.

వేమగిరిలో కూటమి నాయకుల సంబరాలు

కడియం, జూన్ 27: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా వేమగిరిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేశారు. కూటమి నాయకులంతా ఐకమత్యంగా ఉండి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో దంగేటి సత్తిబాబు, సూరపరెడ్డి జానకిరామ్, చెల్లుబోయిన శ్రీనువాసరావు, అల్లంపల్లి ప్రసాద్, సుంకర గోపాలకృష్ణ, కొప్పిశెట్టి రాజేష్, యనమదల రాజు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ తరగతులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభించారని తెలిపారు. తక్షణమే అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని, పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ వయోపరిమితి పెంచాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27: డీఎస్సీ-2024 వయోపరిమితిని 48 ఏళ్లకు పెంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు బహిరంగ లేఖ రాసినట్టు తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఎన్‌డీఏ ప్రభుత్వం జూలై 1న ప్రకటించబోయే డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఓసీ జనరల్ అభ్యర్థుల వయోపరిమితి సడలింపును 48 ఏళ్లకు పొడిగించాలన్నారు. రాష్ట్రంలో 2018 తర్వాత కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జనరల్ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలన్నారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

ధవళేశ్వరం, జూన్ 27: బధిరులకు సులభతరమైన విద్యను అందుబాటులో తీసుకొచ్చిన హెలెన్ కెల్లర్ జయంతిని స్థానిక సంకల్పం సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించారు. పాఠశాల నిర్వాహకురాలు గంటా కనకదుర్గ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కెల్లర్ ఎందరికో మార్గదర్శకురాలు అని బధిరులకు విద్యను బోధించడానికి ప్రత్యేక విధానాన్ని వెలుగులోకి తీసుకొచ్చారన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన శాస్త్రవేత్తలు



కడియం, జూన్ 27: అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కడియం నర్సరీలు ఉద్యాన పరిశోధన కేంద్రాలుగా పనిచేస్తున్నాయని అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్(ఆటరీ) జోన్-10 డైరెక్టర్ డా. షేక్ ఎన్ మీరా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చి(ఐఐవోఆర్)-హైదరాబాదు) డా. ఆర్‌కే మాథ్యూర్ అన్నారు. గురువారం కడియపులంక సత్యదేవానర్సరీని సీనియర్ శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. నర్సరీలో ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల మొక్కల వివరాలను శ్రీసత్యదేవానర్సరీ అధినేత పుల్లా చంటియ్య ఎండీ పుల్లా పెదసత్యనారాయణలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇనిస్టిట్యూట్ నుంచి ప్రమీలరాణి, వైఎస్సార్ హార్టీకల్చర్ ఇనిస్టిట్యూట్ నుంచి కరుణశ్రీ, నర్సరీ రైతులు పుల్లా రామకృష్ణ, పుల్లా వీరబాబు, మెర్ల కృష్ణ పాల్గొన్నారు.

సీతానగరం డిగ్రీ కళాశాలను సందర్శించిన 'నాక్'

సీతానగరం, జూన్ 27: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గ్రేడ్ కేటాయించడానికి రెండు రోజుల పర్యటనలో భాగంగా నాక్ బృందం కళాశాలకు గురువారం వచ్చింది. నాక్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రామన్ రంగరాజన్, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ వైహెచ్ నాయక్ వడి, మెంబర్ అంజన్‌కుమార్ నాయుడులు తొలిరోజున కళాశాలలో పర్యటించారు. రికార్డులను పరిశీలించి అధ్యాపకుల పనితీరును, భవనాలు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు తదితర విషయాలను పరిశీలించారు. తదనంతరం కళాశాల కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు, వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు

ప్రాజెక్టులపై.. జ..గన్!

జగన్ పాలనకు ఈ ప్రాజెక్టు పెద్ద ఉదాహరణ : ఇదీ రంపచోడవరంలోని ముసురుమిల్లి ప్రాజెక్టు..223 కోట్ల ఖర్చుతో 95 శాతం పనులు పూర్తయ్యాయి.. రైతులు గత ప్రభుత్వంలో అందుబాటులోకి వస్తుందని ఆశించారు.. ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం ఐదు శాతం పనులు పూర్తిచేయకుండా ఇలా గాలికొదిలేశారు..





వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని పక్కన పెట్టేసింది.. రివర్స్ టెండరింగ్ పేరుతో అంతా రివర్స్ చేసేసింది.. ఒక్కప్రాజెక్టు పూర్తి చేయలేదు..అన్నదాతల కన్నీటిని తుడవలేదు.. రైతు భరోసా ఇస్తున్నామని చెప్పుకోవడం తప్ప.. అన్నదాత గురించి ఆలోచనే చేయలేదు.. చేస్తే ఇలా ఎందుకు ఉంటుంది.. కేవలం చంద్రబాబుపై కక్ష సాధింపు తప్ప ఏం లేదు.. చంద్రబాబు సీఎం హోదాలో ఆరంభించిన ఏ ఒక్కప్రాజెక్టును పూర్తిచేయలేదు.. రంపచోడవరంలో రూ.223 కోట్లతో ఆరంభించిన ముసురుమిల్లి ప్రాజెక్టు పనులు 95 శాతం పూర్తయ్యాయి. కేవలం ఐదు శాతం పూర్తి చేయాలి.. అది కూడా కేవలం గేట్లు అమరిక.. అదీ చేయలేదు. 29 గ్రామాలకు నీరందించే ప్రాజెక్టును అటకెక్కించారు. గోకవరం మండలం నుంచి 38 కిలోమీటర్ల పరిధిలో 20 గ్రామాలకు సాగునీరందించే సూరంపాలెం కాలువకు కనీసం పూడిక తీయించలేకపోయారు.. 7 గ్రామాలకు సాగునీరందించే మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని ఆపేశారు. పాలకులు అడిగితేనే పుష్కరకాలువ నుంచి నీటిని విడుదల చేసేలా మార్చేశారు. ఇక పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం చంద్ర బాబు హయాంలో ప్రారంభించారు. ఎన్‌జీటీ అనుమతులకు కేవలం రూ.2 కోట్లు కట్టకుండా ఐదేళ్లుగా నిరుపయోగంగా మార్చేశారు. ఇలా ఐదేళ్ల వైసీపీ పాలనకు ఈ ప్రాజెక్టులే నిదర్శనం. సంక్షేమం ముసుగు వేసి పాలన సాగించారు తప్ప.. ప్రజా సంక్షేమం చూడలేకపోయారు. - గోకవరం


పూడుకుపోయిన సూరంపాలెం కాలువ

ప్రాజెక్టు 95 శాతం పూర్తిచేస్తే.. వదిలేశారు..

ఏజెన్సీ ప్రాంతం రంపచోడవరంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన ముసురుమిల్లి ప్రాజెక్టుకు ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు గేట్లు అమర్చలేదు. దీంతో నీరు నిల్వ ఉండే మార్గంలేక రైతులు ప్రాజెక్టు ఫలాలను అందుకోలేకపోతున్నారు. ఈ పాటికి గేట్లు అమర్చి ఉంటే సుమారు 23 వేల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి వచ్చేది. గేట్లు కూడా ప్రాజెక్టు వద్దే ఉన్నాయి. అయినా గేట్లు అమర్చలేదు. ప్రాజెక్టు అం దుబాటులోకి రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 2004 సంవత్సరంలో 223 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 5 శాతం పనులు పూర్తిచేయ లేదు. దీంతో 223 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు నిరుప యోగంగా మారిపోయింది.ఈ సాగునీటి పథకానికి కేవలం రూ.5 కోట్లు ఖర్చు చేస్తే ఏజెన్సీ ప్రాంతాలైన రంప చోడ వరం, దేవీపట్నం, గంగవరం మండలాలతో పాటు గోకవ రం, కోరుకొండ మండలాల్లోని 29 గ్రామాలకు చెం దిన 22,300 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

- ఐదేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులన్నీ గాలికే
- పురుషోత్తపట్నానికి ఎన్‌జీటీ అనుమతులు తీసుకురాలేదు
- 5శాతం పనులు పూర్తిచేయలేని ముసురుమిల్లి
- రివర్స్‌టెండర్‌తో ఆగిన మల్లవరం
- సూరంపాలెం కాలువను పూడ్చేశారు
- పుష్కరకాలువ నిర్వహణ అస్తవ్యస్తం
- చంద్రబాబుపై కక్ష.. ముందుకు సాగని ప్రాజెక్టులు
- కూటమి ప్రభుత్వం రాకతో రైతుల ఎదురుచూపులు

పుష్కర కాలువ..కన్నీళ్లు

పుష్కర కాలువ నిర్వహణ సక్రమంగా లేదు. ఆయకట్టు 1.41 లక్షలు.. రూ.600 కోట్లతో 2006లో కాలువ పనులు ప్రారంభిం చారు. ప్రాజెక్టు పరిధిలో 2009 నుంచి పూర్తిగా సాగునీరందించారు. దేవీపట్నం మండలం నేలకోట నుంచి అన్నవరం వరకూ 97 కిలోమీటర్ల మేర సాగు నీరందించే విధంగా ఏర్పాటు చేశారు. మొత్తం 18 మండలాల పరిధిలో ఉంది. ఈ కాలువ కింద గోకవరం మండలంలో 3100 ఎకరాలు, జగ్గంపేట మండలంలో 19 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మొన్నటి వరకూ ఈ కాలువ నిర్వహణ అంతా వైసీపీ నాయకుల చేతుల్లోనే ఉంది. ఐదేళ్లా రైతుల అవసరాలకు తగినట్టు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవు. పుష్కరకాలువ గట్లపై భారీలోడు గ్రావెల్ లారీలు, నల్లకంకర లారీలు రాత్రనక పగలనక తిరగడంతో కాలువ గట్లు దెబ్బతి న్నాయి. వంతెనలు కూడా శిథిలావస్థకు చేరాయి. అక్రమ ఆదాయంపై ఉన్న శ్రద్ధ రైతుల అవసరాలపై దృష్టి సారించకపో వడం గమ నార్హం. ప్రస్తుతం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలో సాగునీటి పథకాలకు మహర్దశ పట్టనుందని రైతులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

నీరివ్వని సూరంపాలెం కాలువ

సూరంపాలెం కాలువ నుంచి అడపాదడపా వచ్చే నీరు గత కొనేళ్లుగా రైతుల చెంతకు చేరడం లేదు. దీనికి ప్రధాన కారణం కాలువలో పూడిక పనులు చేపట్టక పోవ డమే. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కాలువ ఒక టుందనే సంగతినే పూర్తిగా విస్మరించింది. 2006 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు వల్ల గంగవరం, గోకవరం, కోరుకొండ మండలాల్లోని 20 గ్రామాలకు సాగు నీరు చేరుతుంది. సుమారు 38 కిలోమీటర్ల మేర సూరం పాలెం ప్రధానకాలువ విస్తరించి ఉంది. ఇంత ప్రాధాన్యత ఉన్న కాలువలో పూడికతీత పనులను అధికారులు మరవ డంతో రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు.


మల్లవరం ఎత్తిపోతల పథకం పైపులు

మల్లవరం..మాటేలేదు..

ఏలేరు రిజర్వాయరు నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తెచ్చి మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దే శంతో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే (ప్రస్తుతం కూటమి ఎమ్మెల్యే) జ్యోతుల నెహ్రూ 2018లో తెచ్చిన పథకమే మల్లవరం ఎత్తిపోతల పథకం. సుమారు 20 శాతం పనులు పూర్త య్యాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం రివర్స్ టెండరింగ్ పేరిట పథకాన్ని అటకెక్కించారు. ప్రస్తుతం ఈ సాగు, తాగు నీటికి పథకానికి సం బంధించి పూర్తి సామగ్రి ఇప్పటికీ అలాగే మూలుగు తుంది. ఎమ్మెల్యే నెహ్రూ హయాంలో రూ.132.79 కోట్లు వ్యయంతో మంజూరైన ఈ పథకం పనులు పూర్తయితే గంగవరం,జగ్గంపేట, గోకవరం మం డలాల్లోని 7 గ్రామాల్లో సుమారు 9,300 ఎకరాలకు సాగునీటితో పాటు, పలు గ్రామాలకు తాగునీరు కూడా అందుతుంది.

నిరుపయోగంగా మారిన సూరంపాలెం ప్రాజెక్టు


పట్టని..పురుషోత్తపట్టణం



1638 కోట్లతో నిర్మించిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు ప్రాంతం

సీతానగరం, జూన్ 27 : 1638 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు అది.. ఆ ప్రాజెక్టు,రైతులు చేసుకున్న పాపం ఏమిటంటే.. చంద్రబాబు నాయుడు హయాంలో పూర్తికావడమే.. కేవలం ఎన్‌జీటీ అనుమతులు లేవంటూ ఆ ప్రాజెక్టు వైపే చూడలేదు. ఇదీ జగన్ కక్షపూరిత ధోరణికి ఇదొక నిదర్శనం. 2017వ సంవత్సరంలో జలసిరి హారతి పథకంలో భాగంగా 28 ఇరిగేషన్ ప్రాజెక్టులను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తలపెట్టింది. వాటిలో పురుషోత్తపట్నం ఒకటి. ఇది 2.15 లక్షల ఎకరాలకు సాగునీరు, విశాఖ వాసులకు తాగునీరందించాలన్న ఉద్దేశంతో రూపుదిద్దు కుం ది.రాజానగరం, జగ్గంపేట,పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు మండలాలకు పోలవరం కెనాల్ ద్వారా 20 వేల ఎకరాలు, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 67 వేల ఎకరాలు వ్యవసాయ భూములకు నేరుగా సాగునీరందించేలా రూపకల్పన చేశారు. పోలవరం చానల్స్ ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు నీరు మళ్లించి అక్కడ నుంచి దగ్గరలోని చెరువుల్లోకి నీటిని నిల్వ చేస్తారు. ఈ మేరకు 10 పంపులను పురుషోత్త పట్నం పంపింగ్ స్కీం వద్ద ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పంపు 350 టీఎంసీల నీటిని విడుదల చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేశారు.1638 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించి ఆగస్టు 15న ఫస్ట్ ఫేజ్‌లో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2 పంపులను ప్రారంభించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు లేవని ఎన్‌జీటీలో పిటిషన్ దాఖలు కావడంతో పంపింగ్ స్కీమ్‌ను నిలిపివేసారు. ఈ కేసును గతేడాది విచారించిన సుప్రీంకోర్టు రూ 2.48 కోట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి చెల్లించాలని ఆదేశించింది. నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయలేదు. దీంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి పూర్వవైభవం వస్తుందని మెట్ట ప్రాంత రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

మల్లవరం ఆశలపై నీళ్లు చల్లిన వైసీపీ పాలకులు

మల్లవరం ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే మెట్ట ప్రాంతమైన గోకవరం, గంగవరం, జగ్గంపేట మండలా ల్లోని పలు ప్రాంతాలు వ్యవసాయం పరంగా ఎంతో అభివృద్ధి చెందేవి. ప్రస్తుత ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృషితో 2019కి ముందు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం మంజూరైంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో ఆటకెక్కించింది. దీంత మా ఆశలన్నీ అడియాసలయ్యాయి. - ఇదుదల అర్జునరావు, మాజీ ఎంపీటీసీ, మల్లవరం.



95 శాతం పూర్తయిన ముసురుమిల్లి ప్రాజెక్టు గాలికొదిలేశారు

సుమారు 20 ఏళ్ల కిందట శంకుస్థాపన చేసిన ముసురుమిల్లి ప్రాజెక్టును పాలకులు గాలికొదిలేశారు. సుమారు 95 శాతం పనులు పూర్తి చేసుకున్న ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.5 కోట్లు ఖర్చు చేస్తే వేలాది ఎకరాలకు సాగునీరందుతోంది. కానీ ఆ దిశగా ఏఒక్కరూ ఆలోచించడంలేదు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ ప్రాజెక్టుపై దృష్టి సారిస్తే సుమారు ఐదు మండలాల రైతులకు మేలు చేసినవారవుతారు.
-చింతల రామకృష్ణ, గోకవరం, రైతు



1న ఇంటికే పింఛన్లు

- జిల్లాలో 2,44,302 మంది పింఛనుదారులు
- ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం,జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను వచ్చే నెల ఒకటో తేదీ ఉదయం 5 గంటల నుంచే ఇంటింటికీ పంపిణీ చేసే ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ, ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, సమీకృత ధ్రువపత్రాలు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో 2,44,302 మందికి రూ.165 కోట్ల 13 లక్షల 29 వేల 500 పంపిణీ చేస్తున్నామన్నారు.ఈసారి వలంటీర్లకు బదులుగా సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ పంపిణీ చేస్తారన్నారు. సీఎఫ్ఎంఎస్ ఐడీ కలిగిన ఉద్యోగుల వివరాలు మ్యాపింగ్ చేస్తున్నామని, 29వ తేదీన బ్యాంకు నుంచి పింఛన్ సొమ్ము డ్రా చేస్తామన్నారు. లబ్ధిదారులకు పింఛన్ ఇచ్చిన వెంటనే రశీదు తీసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి కనీసం 50 పింఛన్లు ఇవ్వాలన్నారు. ఆధార్ బేస్డ్ విధానంలో పింఛన్లు పంపిణీ చేస్తారని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్టు చెప్పారు. బయోమెట్రిక్, ఐరిష్, ఫేస్ గుర్తింపు వంటి విధానాల్లో పింఛన్ల పంపిణీ జరగాలన్నారు. ఉద్యోగుల సేవలు వినియోగించుకునే అధికారం మునిసిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో తహశీల్దార్లు అందరూ రైస్ కార్డు ఆధారంగా సమీకృత ధ్రువ పత్రాలు జారీ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 1,12,869 మందికి చెందిన సమీకృత ధ్రువపత్రాలు జారీ చేయవలసి ఉందన్నారు. ఆర్డీవోలు సమన్వయం చేసుకుంటూ వీఆర్వోల ద్వారా రోజుకు కనీసం 50 ధ్రువపత్రాలు పరిశీలించి ఆర్ఐల ద్వారా తహశీల్దార్ లాగిన్‌లోకి అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీ ఎస్.మూర్తి, డీఆర్వో జి.నరసింహులు, డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, వి.శాంత మణి, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి,జి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

124 టన్నుల పంచదార వెనక్కి

- టన్నున్నర కందిపప్పు కూడా - కాటా తేడా కారణం
- వచ్చే నెల బియ్యం ఒకటే పంపిణీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
పౌరసరఫరాల సంస్థ జిల్లాలో రేషన్, ఐసీడీఎస్ నిమిత్తం సరఫరా చేస్తున్న పంచదార,కందిపప్పు పలు రకాల నిత్యావసరాలు పంపిణీ చేస్తుంది. పంచదార, కందిపప్పు తూకాల్లో తేడాలు గమనించిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వంలోని కాంట్రాక్టర్లపై కేసు పెట్టడంతో పాటు సరుకు జిల్లాల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటుంది. జిల్లాలో 124.5 టన్నుల పంచదారను తిరిగి పంపించేశారు. కోరుకొండలో ఐసీడీఎస్‌కు సంబంధించి 1.5 టన్నుల కందిపప్పులో తేడా ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని అక్కడ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు. ఈ పరిస్థితుల్లో జూలై నెల రేషన్‌లో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేయనున్నారు. జూలైలో ఇవ్వవలసిన పంచదార,కందిపప్పు కూడా ఆగస్టు నెలలో రెండు నెలలది ఇవ్వనున్నారు.వైసీపీ ప్రభుత్వంలో కాటా కోటాలో తేడాలతో పాటు, గత అక్టోబరు నుంచి కందిపప్పు కూడా ఇవ్వని సంగతి తెలిసిందే.

రంగు..పడలే!

- ప్రజాధనం వృథా చేయని కూటమి
- జిల్లాలో 986 పాఠశాలలు
- 1,03,422 మంది విద్యార్థులు
- గత ప్రభుత్వ రంగులతోనే కిట్
- ఆశ్చర్యపోతున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వ తీరుకు అభినందనలు

నిడదవోలు, జూన్ 27 : ఆదర్శానికి అర్థంగా కూటమి ప్రభుత్వం నిలిచింది. మంచి నిర్ణయంతో అందరిచేత శెహబాస్ అనిపించుకుంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో తయారైన జగనన్న కిట్లను అచ్చంగా అలాగే విద్యార్థులకు అందజేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో 10వ తరగతి తెలుగువాచకంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు అమరావతి అనే పాఠ్యాంశాన్ని చేర్చారు.నాడు పుస్తకాలు ముద్రించేశారు. అయితే అమరావతి అనే పదాన్నే ఇష్టపడని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు అమరావతి పాఠ్యాంశం లేకుండా మళ్లీ పుస్తకాలు ముద్రించి పంపిణీ చేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల నిర్ణయంతో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సిద్ధమైన విద్యాకానుకను యథావిధిగా విద్యార్థులకు అందించి తమ పాలన గొప్పతనాన్ని చాటుకున్నారు.ప్రజాధనం వృథాకాకుండా చూశారు. జిల్లాలోని 19 మండలాల్లో ఉన్న 986 పాఠశాలల్లో 49,348 బాలురు, 54,074 బాలికలు మొత్తం 1,03,422 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా విద్యార్థులందరికీ కూటమి ప్రభుత్వ పెద్దలు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. అయితే వైసీపీ పాలనలో తయారైన జగనన్న కిట్లను అచ్చంగా అలాగే పంపిణీ చేయడంతో అంతా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం వారు తమ రంగులతో పథకాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుంది..గత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే బడులను వదల్లేదు.. సచివాలయాలను వదల్లేదు.. చివరికి మంచినీటి ట్యాంకులు.. కరెంటు స్తంభాలు.. సచివాలయాలు.. వంతెనలు..అన్నింటినీ వైసీపీ రంగులే.. చివరికి పాస్ పుస్తకాలు, దస్తావేజులపై కూడా జగన్ బొమ్మ ఉండేలా చూసుకున్నారు. ఎంత ప్రజాధనం వృథా అయినా పరవాలేదనేది వైసీపీ లెక్క.. అయితే ఒక్క రూపాయి కూడా వృథా కాకూడదనేది కూటమి లెక్క..కూటమి అధికారం చేపట్టి 20 రోజులైనా గత ప్రభుత్వ రంగులతో ఉన్న విద్యా కానుక కిట్లనే పంపిణీ చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూశారు. చంద్రబాబు నిర్ణయానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు చెప్పారు.

ప్రజాధనం వృథా కాకూడదనే : మంత్రి దుర్గేష్

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా వైసీపీ ప్రభుత్వంలో సిద్ధం చేసిన స్కూల్‌బ్యాగ్స్, బుక్స్‌తో కూడిన స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థులకు అందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశా లలో గురువారం విద్యార్థులకు గత ప్రభుత్వ విద్యా కానుక..కూటమి ప్రభుత్వంలో పేరు మార్చిన స్టూడెంట్ కిట్స్‌ను యథావిధిగా అందించి మాట్లాడారు.వైసీపీ రంగులతో అచ్చు వేయించిన ఉన్న బ్యాగ్‌లను యథావిధిగా పంపిణీ చేశామని చెప్పారు. పార్టీలు వేరు, రాజకీయాలు వేరు..ప్రభుత్వమనేది నిరంతర ప్రక్రియ అన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తరువాత కూడా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. స్టూడెంట్ కిట్ అనేది గత ప్రభుత్వంలో నిర్ణయమని..మా కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగించామన్నారు. రాజకీ యంగా బేదాభిప్రాయాలు ఉండవచ్చు..ప్రజలకు మేలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెరుకూరి పద్మ మాట్లాడుతూ మన ఆహ్వానాన్ని మన్నించి పాఠశాలకు విచ్చేసిన గౌరవనీయులు ప్రియతమ మంత్రివర్యులు సురేష్ గారికి హృదయ పూర్వక స్వాగతమంటూ ఉపన్యసించడంతో అంతా ఉలికి పాటుకు గురయ్యారు.నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పేరు.. ఆమెకు తెలియకపోతే ఎలా అంటూ గుసగుసలాడుకున్నారు.



గత వైసీపీ ప్రభుత్వంలో తయారైన రంగుల బ్యాగ్‌లనే విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌గా అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నన్నయ వర్శిటీలో దోపిడీ.. నాలుగు రోజుల్లో బయటపెడతా

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ, జూన్ 27 : నన్నయ వర్శిటీలో భయంకర దోపిడీ జరిగిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు.నన్నయ వర్శిటీ అక్రమాల పుట్టగా తయారైందన్నారు.ఈ భాగోతాన్ని నాలుగు రోజుల్లో మీడియా ముందుంచుతానన్నారు. దీనిపై సమగ్ర నివేదికను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అం దజేస్తామని తెలిపారు. యూనివర్శిటీ లంచాలమయంగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కీలకమైన విభాగాల్లో తన సొంత మనుషులను పెట్టుకుని నిధులు మళ్లించారని ఆరోపించారు. విద్యార్థుల కట్టిన కోట్లాది రూపాయల ఫీజు పక్కదారి పట్టిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో చేసిన పనులకు రూ.216.17 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే అంచనాలు రూపొందించామని తెలిపారు.కూటమి ప్రభుత్వంలో 3 నెలల్లో ఇబ్బందులను అధిగమించి నియోజకవర్గాలను అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రెండు పంటలకు సాగునీరిస్తామన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్, డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.రియల్ ఎస్టేట్ దొంగలను వదలమన్నారు.పోలీసులను అడ్డుపెట్టుకుని సాగించిన అక్రమాలు వెలికితీస్తామన్నారు.కోరుకొండ భూముల విషయం సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



మాధవీలత వీడ్కోలు సభలో ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్, ఎస్పీ జగదీశ్, డీఆర్‌వో నరసింహులు, ఆర్‌డీవోలు చైత్రవర్షిణి, శ్రీవాత్సవ

మాధవీలతకు ఘన వీడ్కోలు

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, జూన్ 27 : జిల్లా కలెక్టర్‌గా తాను పనిచేసిన 26 నెలల్లో ప్రజలు, అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరుపురాని ఘట్టం అని రిలీవైన కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత అన్నారు. స్థానిక పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం రాత్రి కలెక్టర్ మాధవీ లతకు వీడ్కోలు పలికారు. దీనిలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ జిల్లాతో నాకు ఎంతో అనుబంధం ఏర్పడిందన్నారు.జిల్లాకు తొలి కలెక్టర్‌ను కావడంతో అనువణువు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్ భరత్, ఎస్పీ పి.జగదీష్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌వో జి. నరసింహులు, ఆర్డీవో చైత్రవర్షిణి తదితరులు హాజరయ్యారు.

వైసీపీకి సగ్గొండ సర్పంచ్ దంపతుల రాజీనామా



రాజీనామా పత్రాలు చూపిస్తున్న శేఖర్‌బాబు, కవిత దంపతులు

గోపాలపురం, జూన్ 27: మండలంలోని సగ్గొండ గ్రామ పంచాయతీ సర్పంచ్, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యండపల్లి శేఖర్‌బాబు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు యండపల్లి కవి దంపతులు గురువారం వైసీపీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను పార్టీ కార్యాలయానికి పంపినట్టు వారు తెలిపారు. అనంతరం శేఖర్‌బాబు, కవి దంపతులు పాత్రికేయులతో మాట్లాడుతూ పంచాయతీ పాలక వర్గాలు ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోగా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న 13, 14, 15 ఆర్థిక సంఘం నిధులను సైతం సర్పంచ్‌లకు తెలియకుండానే పంచాయతీ ఖాతాల్లో నుంచి అప్పటి సీఎం జగన్ స్వాహా చేయడాన్ని తప్పుబట్టారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయనడం, తీరా చూస్తే అవి సాంకేతిక అమలుకు కూడా నోచుకోకపోవడంతో గ్రామస్థుల ఎదుట తలెత్తుకుని తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు పంచాయతీలకు పూర్వపు వైభవం తెస్తానని ప్రకటించడంతో టీడీపీకి ఆకర్షితులమయ్యామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు నచ్చక గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి తాను, మండల మహిళా అధ్యక్షురాలి పదవికి తన భార్య రాజీనామా చేస్తున్నామన్నారు. త్వరలోనే టీడీపీలో చేరుతామన్నారు.

కానూరులో మినరల్ వాటర్ ప్లాంట్



కానూరులో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఇంద్రకుమార్

పెరవలి, జూన్ 27: కానూరులో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను అవంతి ఫీడ్స్ లిమిటెడ్ సీఎండీ, అవంతి మేనేజింగ్ ట్రస్టు అల్లూరి ఇంద్రకుమార్ గురువారం ప్రారంభించారు. కానూరు గ్రామస్థులకు సురక్షిత తాగు నీరందించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామని, దీనిని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఇంద్రకుమార్‌కు సర్పంచ్ భావన మధు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుందుల సత్యనారాయణ, అనపర్తి జయ పాల్గొన్నారు.

నేడు నల్లజర్ల సర్వసభ్య సమావేశం

నల్లజర్ల, జూన్ 27: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఎంపీపీ బంకా జయలక్ష్మి విచ్చేస్తున్నారని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

గోల్డ్‌మెడలిస్ట్ అరుణకు జవహర్ అభినందన



అరుణను అభినందిస్తున్న కేఎస్ జవహర్

కొవ్వూరు, జూన్ 27: కేలో ఇండియా ఉషా లీగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన కోరుకొండ అరుణను టీడీపీ జాతీయ కార్యదర్శి, మాజీ మంత్రి కేఎస్ జవహర్ అభినందించారు. కోరుకొండ అరుణ గురువారం మర్యాద పూర్వకంగా జవహర్‌ను కొవ్వూరు ఆయన నివాసంలో కలిశారు. జవహర్ మాట్లాడుతూ కర్ణాటకలోని బగల్ కోట్‌లో ఈ నెల 10నుంచి 13వరకు జరిగిన కేలో ఇండియా ఉషా లీగ్‌లో సీనియర్ 70 కిలోల విభాగంలో విశాఖపట్నానికి చెందిన అరుణ గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను జవహర్ అభినందించారు.

ఎడతెరిపిలేని వర్షం

కొవ్వూరు, జూన్ 27: కొవ్వూరు పట్టణ, మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి ముసురు పట్టుకుని వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. రహదారి గుంతలు, పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా వేసవి ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ముసురుతో వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు.

సుందర గోవిందుడికి ప్రత్యేక పూజలు

కొవ్వూరు, జూన్ 27: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుని ఆలయంలో 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు, సహస్ర కుంభాభిషేకాలు రెండో రోజు కొనసాగాయి. గురువారం గణపతి పూజ, గోపూజ, మండప పునః పూజ, అవాహిత దేవతా హోమాలు, సుబ్రహ్మణ్య షడావరణ అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు రూ.24.08 లక్షల ఆదాయం



హుండీ లెక్కింపులో పాల్గొన్న సేవాదళ్ సభ్యులు, ఆలయ సిబ్బంది

నిడదవోలు, జూన్ 27: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి వి.సోమరాజు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. 91 రోజులకు గాను రూ.24,08,126 ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. వీటితోపాటు అన్నదాన హుండీకి రూ.23,241, బంగారం 28 గ్రాములు, వెండి 217 గ్రాములు, యూఏఈ 50 దీరమ్స్ నోట్ 1, 5 దీరమ్స్ నోట్ 1 లభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సేవాదళ్ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీవీపీ వ్యవస్థాపకుడు సూరజ్‌ప్రకాష్ జయంతి

కొవ్వూరు, జూన్ 27: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) రాజకీయేతర, సామాజిక స్వచ్ఛంద సంస్థ అని పరిషత్ కొవ్వూరు సభ్యుడు, హోమియో వైద్యులు డాక్టర్ కోట సత్యనారాయణమూర్తి అన్నారు. బీవీపీ వ్యవస్థాపకుడు సూరజ్‌ప్రకాష్ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కొవ్వూరు అధ్యక్షుడు వై.రమేష్ మాట్లాడుతూ 1963 జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చైనా దండయాత్రను ఎదుర్కోవడానికి లాలా హన్స్‌రాజ్, సూరజ్‌ప్రకాష్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సంఘ సంస్కర్తలు కలిసి సిటిజన్స్ కౌన్సిల్‌ని స్థాపించారు. తర్వాత దానికి భారత్ వికాస్ పరిషత్ అని పేరు పెట్టారన్నారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో సర్వతో ముఖాభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో గౌరీశంకరరావు, టి.రామచంద్రరావు, గోవర్ధన శ్రీనివాసమూర్తి, ఎస్.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

కొవ్వూరు, జూన్ 27: పదో తరగతి విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన కొక్కిరిపాటి అరుణ కుమారుడు సంజు కొవ్వూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 25న పాఠశాలలో సంజును కుక్క కరిచింది. సమాచారం తెలుసుకున్న తల్లి వచ్చి ఏమి కాదని చెప్పి హాస్టల్లో దించి వెళ్లిపోయింది. 26న పాఠశాలకు వెళ్తానని హాస్టల్ నుంచి వచ్చిన సంజు తిరిగి రాకపోవడంతో చుట్టుప్రక్కల వెతికారు కనిపించకపోవడంతో తల్లికి సమాచారం ఇచ్చారు. దీంతో అరుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు పూర్తి

దివాన్‌చెరువు, జూన్ 27: ఏపీ ఆర్‌సెట్‌లో అర్హత సాధించిన జియాలజీ, మేనేజ్మెంట్ విభాగాల్లో ఆదికవి యూనివర్శిటీ స్థానిక ప్రాంగణంలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు గురువారం పూర్తయినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. మేనేజ్మెంట్ విభాగంలో 321 మంది విద్యార్థులకు 261 మంది హాజరయ్యారన్నారు. అలాగే జియాలజీ స్కాలర్‌లు ఈ నెల 24న నిర్వహించిన ఇంటర్వ్యూలకు 34 మందికి 25 మంది హాజరయ్యారన్నారు. ఆర్.సెట్ కన్వీనర్ సూచనల మేరకు పారదర్శకంగా జియాలజీ, మేనేజ్మెంట్ ఆచార్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు.

కేంద్రం సొమ్ములన్నీ దారి మళ్లించారు

- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న వ్యవస్థలు
- ప్రభుత్వ అధికారులు మైండ్‌సెట్ మార్చుకోవాలి
- రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

పెరవలి, జూన్ 27: గత ప్రభుత్వ హయాంలో వివిధ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సొమ్ములన్నీ దారి మళ్లించారని, దీంతో ఆయా వ్యవస్థలు అన్ని నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. పెరవలి మండల స్థాయి అధికారులు వివిధ శాఖల సిబ్బందితో స్థానిక దీపికా ఫంక్షన్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం అస్తవ్యవస్థ విధానాలతో ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేయడంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ముందుకు సాగడానికి ప్రయత్నిస్తుందన్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంలో పైస్థాయి నుంచి క్రింది స్థాయి అధికారులు ఒక మైండ్‌సెట్టుకు అలవాటుపడి ఉన్నారని, ప్రస్తుతం ఆ అధికారులందరూ తమ మైండ్‌సెట్టు మార్చుకుని ప్రస్తుత ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు అనుభవం, ఉపముఖ్యమంత్రి పవన్ ఉన్నత ఆశయాలతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధిలో పరుగులు పెట్టించడానికి కృషి జరుగుతుందన్నారు. గ్రామాల్లో పాడైపోయిన రోడ్లను పరిశీలించి అంచనాలు తయారు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూ చించారు. అలాగే జల జీవన్ మిషన్ పథకం ద్వారా పలు గ్రామాలకు సాగునీటి పథకాలు మంజూరయ్యాయని, ఆ నిధులను కూడా దారి మళ్లించారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు అలసత్వం వీడి ప్రస్తుత ప్రభుత్వ అడుగు జాడల్లో అభివృద్ధిలోపాలు పంచుకోవాలని కోరారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని, వాటన్నంటిని గాడిలో పెట్టడానికి ప్రభుత్వ యంత్రాంగం అంతా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఉమామహేశ్వరి, తహశీల్దార్ డి.సుధ, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూన్ 27: నిడదవోలులోని ఆనంద్ ఇన్ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో మండల స్థాయి అధికారులతో మంత్రి దుర్గేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జూలై నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ మొదలవుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు పంచాయతీరాజ్ సంక్షేమ పథకాల అమలుతీరుపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్ భూపాల్‌రెడ్డి, ఎంపీడీవో జేప ఝాన్సీ, తహశీల్దార్ ఎ.నాగభూషణం పలు శాఖల అధికార్లు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

- పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా శ్రీరామచంద్రమూర్తి

కొవ్వూరు/తాళ్లపూడి, జూన్ 27: ఎత్తిపోతల పథకాల కమిటీలు తమ ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి పాటుపడాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో పైడిమెట్ట ఎత్తిపోతల పథకం నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా ముళ్ళపూడి శ్రీరామచంద్రమూర్తితోపాటు సభ్యులుగా 12 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకవర్గ సభ్యుల పేర్లు సంబంధిత అధికారులకు పంపించి అధికారికంగా ప్రకటిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ఆయకట్టు కింద 5 గ్రామ పంచాయతీల్లోని 4950 ఎకరాల భూమి ఉందని, ఆయకట్టులోని ప్రతి ఎకరాకు నీరం దించేలా కృషి చేయాలన్నారు. నీటితీరువాను కమిటీ సభ్యులు, రైతులు కలిసి నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు.

నాడు-నేడు పనులను పూర్తిచేయాలి

కొవ్వూరు: నాడు-నేడు పథకంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు 23వ వార్డులోని ముస్లిం ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పథకంలో జరిగిన పనుల్లో నాణ్యత లేదని ఫిర్యాదులు రావడంతో గురువారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పనుల నాణ్యతను పరిశీలించారు. పాఠశాల పైఅంతస్తులో పనులపై అసంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదుల పనులను పూర్తిచేయకుండా ప్రహరి గోడలను పూర్తి చేయడమేమిటన్నారు. అసంతృప్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని హెచ్ఎం, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. విద్యార్థుల సౌకర్యార్థం సురక్షిత తాగునీరు ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, నామాన పరమేష్, జీవీ, కొఠారు వెంకట్రావు, కూచిపూడి గణపతి, దండమూడి శేషు, అన్నమరెడ్డి సత్తిబాబు, బోడపాటి ముత్యాలరావు, పిక్కి నాగేంద్ర, అద్దూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకరరావు



విద్యా ప్రవేశం కార్యక్రమంపై మాట్లాడుతున్న ఏఎంవో గౌరీశంకరరావు

బిక్కవోలు, జూన్ 27: ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ బడి ఈడు పిల్లలందర్నీ సమాజ భాగస్వామ్యంతో బడిలో ఉంచేందుకే విద్యా ప్రవేశం కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డి.గౌరిశంకరరావు తెలిపారు. ఊలపల్లి ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమంపై గురువారం ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు. గత ఐదేళ్ల పాఠశాలలో విద్యార్థుల నమోదు విశ్లేషించి ఈ యేడాది లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోడానికి బృందాలుగా ఏర్పడి ప్రజల సహకారంతో నూరు శాతం విద్యార్థులను నమోదు చేయాలన్నారు. అనంతరం స్టెమ్ లాబ్‌ను పరిశీలించి వినియోగంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈయన వెంట హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి వున్నారు.

పని ప్రదేశంలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూన్ 27: మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక దాడులు, వేధింపులకు గురికాకుండా అరికట్టేందుకు మహిళల రక్షణ కమిటీ ఏర్పాటు చేసి నివేదిక అందజేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ తేజ్‌భరత్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరం నుంచి జిల్లాలో మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఆర్‌వో జి.నరసింహులుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తేజ్‌భరత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14, 15 హెచ్ ప్రకారం లింగ సమానత్వం స్త్రీల ప్రాథమిక హక్కు, ఆర్టికల్ 21 ప్రకారం గౌరంగా జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు, లైంగిక వేధింపులకు గురికాకుండా సురక్షితమైన వాతావరణం హక్కును కలిగి వున్నారని చెప్పారు. మహిళలు పనిచేసే చోట అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ రాజ్యాంగం పరిమితులకు లోబడి పని చేయాలన్నారు. ఆయా కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ యూనిట్ల డివిజనల్ లేదా సబ్‌డివిజన్ స్థాయిలో వివిధ ప్రదేశాల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసి వాటి నివేదిక అందజేయాలని ఆదేశించారు. విజయకుమారి మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశంలో నిబంధనలకు అనుగుణంగా సీనియర్ ఉద్యోగిని, ఒకవేళ ఆమె లేకపోతే అందుబాటులో ఉన్న అధికారిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలన్నారు. మహిళ భద్రత విషయంలో ప్రాధాన్యమిస్తూ కమిటి ఏర్పాటు చేయాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియ పర్యవేక్షణకు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నోడల్ అధికారిగా వ్యవహరించాలని చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



దేవరపల్లిలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, జూన్ 27: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని, అన్ని శాఖాధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని శాఖల ఉద్యోగులతో పరిచయ కార్యక్రమం, సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. గోపాలపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దటానికి సహకరించాలన్నారు. కాగా ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా అధికారులతో సమీక్షా సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే మద్దిపాటికి టీడీపీ, జనసేన నాయకులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా మండలంలోని సంగాయిగూడెంలో ఎన్టీఆర్ విగ్రహంపై రూ.లక్షతో నిర్మించిన షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే గ్రామంలోని సచివాలయం, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. గ్రామానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ ఆచార్యులు, ఎంపీడీవో పి.ప్రభాకరరావు, సీఐ బాలసురేష్, టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనీల్, మాజీ జడ్పీటీసీ కొయ్యలమూడి సుధారాణి, టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, గద్దె సుబ్రహ్మణ్యం, ముళ్లపూడి దొరాజి చౌదరి, కరుటూరి శ్రీనివాస్, జనసేన నాయకులు సత్తిబాబు, జాజిమొగ్గల శ్రీనివాస్, సూరిశెట్టి బాలు, సంగాయిగూడెం సర్పంచ్ కరుటూరి ఉషారాణి, పొగాకుబోర్డు రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, దొనేల్లి పద్మజ, సుంకవల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

వరిలో విత్తనం చల్లే విధానాన్ని ప్రోత్సహించాలి



ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ప్రమీలారాణి

వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ప్రమీలారాణి

దివాన్‌చెరువు, జూన్ 27: జిల్లాలో ప్రధాన పంట అయిన వరిలో నేరుగా విత్తనం జల్లే విధానం ప్రోత్సహించాలని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు బి.ప్రమీలారాణి సూచించారు. తద్వారా సాగు ఖర్చులో ఎకరాకు రూ.6 వేలు నుంచి రూ.8 వేలు ఆదా అవుతుందన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాన్ని ప్రమీలారాణి, ఉప విస్తరణ సంచాలకుడు బి.ముకుందరావు గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేంద్రం ప్రగతి, కార్యక్రమాలను అడిగి తెలుసుకుని శాస్త్రవేత్తల పనితీరును ప్రశంసించారు. అనంతరం మాట్లాడుతూ వరిలో నేరుగా విత్తనం జల్లే దిశగా ప్రోత్సహించేందుకు అవసరమైన శిక్షణాకార్యక్రమాలు, ప్రాజెక్టు రూపొందించాలని శాస్త్రవేత్తలకు ప్రమీలారాణి అన్నారు. జిల్లాలో రైతు కమతాల్లో చిరుసంచుల ప్రదర్శనకు, క్షేత్ర ప్రదర్శనకు సంబంధించి విత్తనాల పంపిణీ సకాలంలో చేపట్టినందుకు శాస్త్రవేత్తలను ప్రశంసించారు. ఏరువాక కేంద్రం ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల ముంగిటకు చేర్చి, వారు స్థిరమైన నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు సాధించడానికి, అన్నదాతల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. మెట్టప్రాంతాల్లో అపరాలు, శెనగ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమజ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. స్థానిక లాలాచెరువు హైస్కూల్లో సంస్థ ఆధ్వర్యంలో మంచి, చెడు స్పర్శ, విద్యా చట్టాలపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని, గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. తద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించే అవకాశం ఉంటుందన్నారు. దేశభక్తి, సోదరభావం పొంపొందేలా మెలగాలని.. పెద్దలకు గౌరవిస్తూ మర్యాదగా నడుచుకోవాలని హితవు పలికారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న ఆహారాన్ని పరిశీలించారు. కార్య క్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లలితకుమారి, డీసీపీవో రాజ్‌కుమార్, హెచ్ఎం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27 : రాజమహేంద్రవరం జెఎన్‌రోడ్డులోని డి1 కన్వెన్షన్‌లో ఈ నెల 29న మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024ను నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు తీగల రాజా తెలిపారు. స్థానిక ఏవీఏ రోడ్డు పాత సోమాలమ్మ ఆలయం సమీపంలోని క్లబ్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆడిషన్స్, వచ్చే నెల 20న ఆనం కళాకేంద్రంలో గ్రాండ్ ఫైనల్స్ జరుగుతాయన్నారు. అనంతరం మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024 బ్రోచర్ ఆవిష్కరించారు. ఆడిషన్స్‌కు మిస్ ఇండియా 2023 విజేత నందిని గుప్తా హాజరవుతున్నారని చెప్పారు. సమావేశంలో రామచంద్రారెడ్డి, రేణుక నవీన్, కుమార్, జాన్, శివ పాల్గొన్నారు.

బొజ్జ తారకానికి ఘననివాళి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27: పీడిత తాడిత ప్రజల కోసం హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జ తారకం నిరంతరం పోరాటం చేశారన్నారు. ఆయన 85వ జయంతిని గురువారం రాజమహేంద్రవరంలో న్యాయవాది ఇసుకపట్ల రాంబాబు నివాసం, ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సదస్సు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 27: రాజమహేంద్రవరం సిటీ ఆర్ఐలో జరుగుతున్న వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ జోన్-10 కృషి విజ్ఞాన కేం ద్రాల వార్షిక సదస్సు గురువారం ముగిసింది. 3వ రోజు కార్యక్రమంలో 72 కృషి విజ్ఞాన కేంద్రాల అధిపతులు ఆటారి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, ఐసీఏఆర్ డాక్టర్ కె.మాధుర్ కడియం నర్సరీల సందర్శనకు వెళ్లారు. అనంతరం మీరా మాట్లాడుతూ భవిష్యత్‌లో నర్సరీలు ఒక ఉద్యాన హబ్‌గా మారగలవన్నారు. సదస్సు ముగింపు కార్యక్రమంలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను 1,2,3 స్థానాలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ, విత్తన -నారు మొక్కల ఉత్పత్తి, కేవీకే ఆర్థికాభివృద్ధికి విశిష్ట సేవలకు గాను యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి రోలింగ్ షీల్డ్ ప్రదానం చేశారు. సదస్సు విజయవంతానికి కృషి చేసిన సీటీ ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధా న శాస్త్రవేత్త వై.సుబ్బయ్య వందన సమర్పణతో సమావేశాలు ముగిసాయి.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ప్రభుత్వాన్ని కోరిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ తరగతులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభించారని తెలిపారు. తక్షణమే అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని, పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ వయోపరిమితి పెంచాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27: డీఎస్సీ-2024 వయోపరిమితిని 48 ఏళ్లకు పెంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేశ్‌కు బహిరంగ లేఖ రాసినట్టు తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఎన్‌డీఏ ప్రభుత్వం జూలై 1న ప్రకటించబోయే డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఓసీ జనరల్ అభ్యర్థుల వయోపరిమితి సడలింపును 48 ఏళ్లకు పొడిగించాలన్నారు. రాష్ట్రంలో 2018 తర్వాత కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జనరల్ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలన్నారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి

ధవళేశ్వరం, జూన్ 27: బధిరులకు సులభతరమైన విద్యను అందుబాటులో తీసుకొచ్చిన హెలెన్ కెల్లర్ జయంతిని స్థానిక సంకల్పం సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించారు. పాఠశాల నిర్వాహకురాలు గంటా కనకదుర్గ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కెల్లర్ ఎందరికో మార్గదర్శకురాలు అని బధిరులకు విద్యను బోధించడానికి ప్రత్యేక విధానాన్ని వెలుగులోకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన శాస్త్రవేత్తలు



శాస్త్రవేత్తలకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న నర్సరీ రైతులు

కడియం, జూన్ 27: అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కడియం నర్సరీలు ఉద్యాన పరిశోధన కేంద్రాలుగా పనిచేస్తున్నాయని అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్(ఆటరీ) జోన్-10 డైరెక్టర్ డా. షేక్ ఎన్ మీరా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చి(ఐఐవోఆర్)-హైదరాబాదు) డా. ఆర్‌కే మాత్తుర్ అన్నారు. గురువారం కడియపులంక సత్యదేవానర్సరీని సీనియర్ శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. నర్సరీలో ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల మొక్కల వివరాలను శ్రీసత్యదేవానర్సరీ అధినేత పుల్లా చంటియ్య, ఎండీ పుల్లా పెదసత్యనారాయణలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇనిస్టిట్యూట్ నుంచి ప్రమీలరాణి, వైఎస్సార్ హార్టీకల్చర్ ఇనిస్టిట్యూట్ నుంచి కరుణశ్రీ, నర్సరీ రైతులు పుల్లా రామకృష్ణ, పుల్లా వీరబాబు, మెర్ల కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిక్కవోలు, జూన్ 27: మండలంలోని పందలపాక సబ్‌స్టేషన్ పరిధిలో వైర్లు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పందలపాక, కొంకుదురు, తొస్సిపూడి, ఆరికరేవుల, మెళ్లూరు, కొమరిపాలెం, బిక్కవోలు సబ్ స్టేషన్ పరిధిలో బిక్కవోలు, ఊలపల్లి, రంగాపురం, నల్లమిల్లి, మర్రిపూడి, బలభద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో కాపవరం, జి. పాకలు గ్రామాల్లో పరిశ్రమలకు, గృహ వినియోగదారులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.